ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 8 అక్టోబరు 2025

విదేశీ కరెన్సీ పేరుతో బురిడీ

- న్యూస్ పేపర్ల కాగితాల కట్ట చేతిలో పెట్టి రూ.4.50 లక్షలతో ఉడాయించారు
- 2 గంటల్లో ముఠాను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణమోహన్

6

దర్యాప్తు ముమ్మరం

- పోలీసుల అదుపులో ఏ2 రాజు
- రిమాండ్‌లో ఉన్న నిందితుల కస్టడీకి పిటీషన్
- మిగిలిన వారి కోసం రంగంలోకి పలు బృందాలు
- నకిలీ మద్యం కేసులో మరో ఏడుగురిని చేర్చే అవకాశం

ములకలచెరువు ప్రధాన ద్వారం



రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం స్కాంను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడంతో కేసు దర్యాప్తు ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పటికే అదుపులో ఉన్న నిందితులు ఇచ్చిన సమాచారంతో ఈ కేసులో మరికొందరిని నిందితులుగా చేరుస్తున్నారు. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు విదేశాలలో ఉండగా జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ పరారీలో ఉన్నాడు. ఇంకా ఒకరిద్దరు నిందితులు పోలీసులకు చిక్కలేదు. నిందితులందరిని అదుపులోకి తీసుకుంటే విచారణ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉండదంతో విచారణాధికారులు నిందితుల గాలింపులో ఉన్నారు. కేసులో ఏ2 కట్టా రాజును ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జనార్దన్‌రావుకు అనుచరుడైన ఇతను నకిలీ మద్యం కేంద్రానికి మేనేజర్‌గా వ్యవహరించేవాడు. దీంతో ఇతడి నుంచి కీలకమైన సమాచారం రాబట్టేందుకు విచారణాధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇతను నకిలీ మద్యం కేంద్రానికి మేనేజర్ కావడంతో మద్యాన్ని బెల్టుషాపులు, మద్యం దుకాణాలకు సరఫరా చేసేవాడని అధికారుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఎక్సైజ్ పోలీసులు నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడులు చేసిన సందర్భంగా దొరికిన డైరీ కూడా ఇతడి రాసినట్లు తెలుస్తోంది. మొత్తం లావాదేవీలు, ఇక్కడ పనిచేసే కూలీలకు జీతాల చెల్లింపు, నకిలీ మద్యం సరఫరా చేసిన బెల్టుషాపులు, మద్యం దుకాణాల నుంచి నగదు వసూలు, పలువురికి మామూళ్ల ఇవ్వడం తదితర అంశాలను ఇతడే చేసినట్లు విచారణలో అధికారుల ముందు చెప్పినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు 10 మందిని అరెస్టు చేయగా ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్, తెనాలికి చెందిన వైసీపీ నేత కొడాలి శ్రీనివాసరావు కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. రాజేశ్ కోసం సోమవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు రాయచోటిలోని ఆయన ఇంటికి వెళ్లినట్లు సమాచారం. కొడాలి శ్రీనివాసావు ఆచూకీ దొరకలేదు. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు.. మరో ఏడుగురిని ఈ కేసులో చేర్చనున్నట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీకి స్పిరిట్, నకిలీ స్టిక్కర్లు, బాటిళ్లు, మూతలు సరఫరా చేసిన వ్యక్తుల వివరాలు సేకరించి వారిపై కేసు నమోదు చేయనున్నారు. ఇంత పెద్ద స్థాయిలో స్పిరిట్ అమ్మిన వ్యక్తులు ఎవరు, ఎక్కడి నుంచి తెచ్చారు అనే కోణంలో ఎక్సైజ్ అధికారులు వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది.

రిమాండ్ నిందితులను కస్టడీకి కోరుతూ కోర్టులో పిటీషన్

ఈ కేసులో అరెస్టయి మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 10 మంది నిందితులను కస్టడీకి ఇవ్వాలని మంగళవారం ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె కోర్టులో పిటీషన్ వేశారు. నకిలీ మద్యం తయారీ, సరఫరాలకు సంబంధించిన ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి ఈనెల 4వ తేదీ విశాఖపట్నంకు చెందిన సయ్యద్‌హాజీ, వాహన డ్రైవర్ బాలాజీ, తమిళనాడుకు చెందిన మనిమారన్, ఆనందన్, సూర్య, సురేశ్, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మిథున్, ఆనంద్‌దాస్, పీటీఎం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు, రంగసముద్రంకు చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి నిందితులను విచారించి పూర్తి వివరాలు రాబట్టాల్సి ఉందని, మూడు రోజుల పాటు 10 మందిని కస్టడీకి ఇవ్వాలని పిటీషన్‌లో పేర్కొన్నారు. తంబళ్లపల్లె జడ్జి ఉమర్ ఫరూక్ నిందితులకు నోటీసులు జారీ చేసి కస్టడీ పిటీషన్‌పై విచారణను బుధవారానికి వాయిదా వేశారు.



ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ హోలోగ్రాం స్టిక్కర్లు లేని నకిలీ మద్యం

ఎక్సైజ్ సీఐపై వేటు



ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందుపై వేటుపడింది. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీని గుర్తించడంతో అలసత్వం వహించిన ఎక్సైజ్ సీఐపై ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ చర్యలు తీసుకున్నారు. సీఐను మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ములకలచెరువు సీఐగా లక్కిరెడ్డిపల్లె సీఐ కిశోర్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. కాగా కాలేదెటా కారణంగా ములకలచెరువు సీఐపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఓ నిందితుడితో సీఐ మాట్లాడిన విషయం కాలేదెటాలో రావడంతో చర్యలు తీసుకున్నట్లు ప్రచారంలో ఉంది.

తిరుచ్చిపై సీతారామలక్ష్మణుల విహారం

- ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుచ్చిపై ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

వాల్మీకిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన పవిత్రోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం తిరుచ్చిపై సీతారామలక్ష్మణులు విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ మండపంలో దేవతామూర్తులకు సమర్పించిన పవిత్రాల వితరణ కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణలు భక్తుల నడుమ వేడుకగా జరిగాయి. అనంతరం సీతారామలక్ష్మణులకు స్నపనతిరుమంజనం, చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై విశేషాలంకరణలతో తిరుమాడ వీధులలో నగరోత్సవం నిర్వహించారు. రాత్రికి ఏకాంతసేవతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, భాష్యాచార్యులు, కృష్ణరాజు భట్టార్, గోకుల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని ప్రతి జిల్లాలో నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. రామాయణాన్ని 24 వేల శ్లోకాలతో మహర్షి వాల్మీకి రచించారని తెలిపారు. ప్రతి ఒక్క శ్లోకం ఒక సందేశాన్ని తెలియజేసే విధంగా ఉంటుందని, దీనిని ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సురేశ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి దామోదరరెడ్డి, స్టేట్ వాల్మీకి డైరెక్టర్ మండెం ప్రభాకర్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు యోగానందబాబు, మదనపల్లె మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్యామలమ్మ, జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వాల్మీకి కుల సంఘ పెద్దలు తదితరులు పాల్గొని వాల్మీకికి నివాళులర్పించారు.

గ్రామాల్లో గస్తీని ముమ్మరం చేయండి : ఎస్పీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ

కలకడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో గస్తీని ముమ్మరం చేయాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలకడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో శాంతిభద్రతల పరిస్థితులను ఆరా తీసి సూచనలు చేశారు. కేసుల పరిష్కారానికి వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పర్యవేక్షణ నిఘా పెంచాలని సీఐ లక్ష్మన్నకు ఆదేశించారు. సిబ్బందితో విడివిడిగా మాట్లాడి వారి సంక్షేమంపై వాకబు చేశారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐతో పాటు ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



జీవిత ఖైదు పడిన నిందితుడు నాగయ్య

గాలివీడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపనపడిపల్లె గ్రామం నల్లాబత్తినవాండ్లపల్లె వాసి రాజు పాలెం నాగయ్య (74)కు తన తమ్ముడు సుబ్బరాయుడును హత్య చేసిన కేసులో జీవిత ఖైదును విధిస్తూ రాయచోటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2022 జూన్ 14న మల్లేశ్వరస్వామి మొక్కుబడి సందర్భంలో గండిమడుగు వద్ద మేక నరికే విషయంలో అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరిగింది. అదేరోజు సాయంత్రం 5 గంటల సమయంలో గ్రామంలోకి వెళ్లి తమ్ముడు సుబ్బరాయుడుపై నాగయ్య వేట కొడవలితో దాడి చేయగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. మంగళవారం రాయచోటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి ఆధ్వర్యంలో విచారణ జరిపి నిందితుడు నాగయ్యకు 326 ఐపీసీ కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా, 302 ఐపీసీ కింద జీవిత ఖైదుతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

ఖతర్‌లో గాలివీడు వాసి మృతి



గాలివీడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం ఖతర్‌కు వెళ్లిన పఠాన్ ఫయాజ్ (29) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు.. గాలివీడు పట్టణం గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద నివాసం ఉంటున్న అజీజ్‌ఖాన్‌కు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు పఠాన్ ఫయాజ్ బతుకుదెరువు కోసం ఖతర్ వెళ్లాడు. అయితే హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఫయాజ్ మృతి చెందినట్లుగా మంగళవారం కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. తమకు దేవుడిచ్చిన ఉండే కొడుకు మృతి చెందడంతో జీవించడం కోలేని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కాగా ఫయాజ్‌కు ఏడాది కిందటే పెళ్లి అయింది. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

పేలవంగా..

- తీరు మారని జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం
- మహిళా, సాంఘిక సంక్షేమ కమిటీల చైర్‌పర్సన్లు డుమ్మా



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

కడప, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి దిశ నిర్దేశం చేయాల్సిన జడ్పీటీసీ సభ్యులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఎప్పటిలాగానే పేలవంగా నిర్వహించారు. మహిళా, సాంఘిక సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్లు జె.శారద(జడ్పీ వైస్ చైర్‌పర్సన్), సిప్రపల్ల (చిట్వేలి జడ్పీటీసీ) హాజరు కాలేదు. అలాగే 50 మంది జడ్పీటీసీలలో దాదాపు సగం మంది డుమ్మా కొట్టారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఒక్కొక్కటి కాకుండా రెండు, మూడుకలిపి ఒకేసారి నిర్వహించారు. కాగా.. ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలుపొందిన పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డిని గ్రామీణ అభివృద్ధి స్థాయి సంఘంలోను, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డిని పనులు స్థాయి సంఘంలోను చేర్చారు.

సమస్యలపై అరకొరగా చర్చ

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలలో ప్రజాసమస్యలపై అరకొరగా చర్చ సాగించారు. జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మాట్లాడుతూ జడ్పీలు, గోపవరం, బి.మఠం, పోరుమామిళ్ల మండలాల్లో జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలన్నారు. చక్రాయపేట మండలంలోని ఎర్రగుడిపాడు సీపీడబ్ల్యూఎస్ స్కీంకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సకాలంలో ప్రజలకు నీరు అందించాలన్నారు. వ్యవసాయ స్థాయి సంఘం చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమైందని రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి మాట్లాడుతూ సోమశిల బ్యాక్ వాటర్‌ను ఒంటిమిట్ట చెరువుకు నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ గండి పుణ్యక్షేత్రంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు అయినా ఎందుకు టెండర్లను పిలువలేదని ప్రశ్నించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడు కొండలు ఒకటి, రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామన్నారు. కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగు పరిచి ఫాగింగ్ యంత్రాలను రిపేరు చేయించి దోమలను అరికట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు ఇవ్వాలని, బోగస్ సర్టిఫికెట్లు మంజూరు చేసిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. చక్రాయపేట జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరతతో ప్రజలకు అవసరమైన పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం, ఉమ్మడి జిల్లాలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు

- ప్రస్తుత పాఠశాలలోనే కొనసాగే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 113 మందికి ఉత్తర్వులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తెలుగు, హిందీ భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న భాషాపండితులకు కల్పించిన స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులు ఈనెల మూడో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో ఉమ్మడి కడప జిల్లాలో 69 మంది తెలుగు, 30 మంది హిందీ, 13 మంది ఉర్దూ, ఒకరు సంస్కృతం.. మొత్తం 113 మంది భాషాపండితులకు ప్రయోజనం చేకూరింది. ఉమ్మడి ఏపీలో నిర్వహించిన డీఎస్సీ ద్వారా నియమితులైన భాషా పండితుల్లో కొంతమందికి గతంలోనే గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 పదోన్నతులు కల్పించారు. వివరిణ 2019లో కొంతమందికి పదోన్నతులు ఇచ్చి, మిగిలిన వారిని డీఈవో పూల్‌లో ఉంచేశారు. దీనిపై భాషాపండితులు గత ప్రభుత్వంతో పోరాడినా ఫలితం దక్కలేదు. డీఈవో పూల్‌లో ఉన్న కారణంగా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ జరిగిన ప్రతిసారి వీరికి బదిలీ తప్పనిసరి అయ్యేది. దీనితో ఎక్కడా రెండేళ్లకు మించి పనిచేయలేక పోయారు సాధారణంగా ఒకచోటకు బదిలీ అయితే ఎనిమిదేళ్ల వరకు అక్కడే పనిచేసుకునే వెసులుబాటు ఎస్జీటీ/స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు ఉంది కానీ డీఈవో పూల్‌లోని భాషాపండితులకు ఈ అవకాశం కల్పించలేదు. ఈ నేపథ్యంలో పట్టభద్ర ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్సీలు ఈ సమస్యను విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ మేరకు డీఈవో పూల్‌లో ఉన్న ఉమ్మడి జిల్లా పరిధిలోని 113 మంది తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పండితులకు ఆధార్ బేసిక్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తూ డీఈవో ఎస్ షంషుద్దీన్ ఈనెల 2వ తేదీన ఉత్తర్వులు ఇచ్చారు. దీనివల్ల ఇప్పటికే క్లస్టర్ స్కూళ్ల పరిధిలో పనిచేస్తున్న పండితులు అక్కడే పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు క్లస్టర్ స్కూళ్ల పరిధిలో (ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలవరకు) ఎక్కడైనా టీచర్లు సెలవుపెడితే అక్కడికి వెళ్లి బోధించాల్సి వచ్చేది. తాజా పదోన్నతుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్నచోటే పనిచేయాలి. అంతేకాదు వచ్చే ఏడాది నిర్వహించే బదిలీ కౌన్సెలింగ్‌లో మిగిలిన టీచర్లతో పాటు వీరికి అవకాశం కల్పిస్తారు. కాగా ఆరేళ్ల నుంచి పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న తమకు న్యాయం చేసిన ప్రభుత్వానికి వీరు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం




కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు, సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయంలో సీతారాముల పౌర్ణమి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణవేదికపై ఆశీనులు చేశారు. ఆలయ అర్చకులు శ్రావణ్‌కుమార్, వీణారాఘవాచార్యులు, పవన్‌కుమార్‌లు వేదమంత్రాల మధ్య మాంగల్యధారణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

'పీఎం కుసుమ్'తో నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్



ఎస్పీడీసీఎల్ సీఎండీతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ గంగాధరం

మదనపల్లె టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పీఎం కుసుమ్ పథకం కింద రైతులకు నాణ్యత కలిగిన విద్యుత్ సరఫరా చేస్తామని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావుతో వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్ల వద్ద ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ కోసం రైతుల సహకారంతో పెద్దసంఖ్యలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా 0.5 నుంచి 2 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు పంపుతామన్నారు. అక్కడి నుంచి రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 718 మంది సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. జిల్లాలో రూ.21 కోట్లతో ఏడు కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఎస్టీఎస్ఎల్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం, ఏడీఈ హరిబాబు, ఏఈలు ఆయూబ్‌బాబు, కుమారబాబు, రామలక్ష్మయ్య, ప్రసాద్, రమేశ్, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు

- 13 నెలలుగా జీతాల కోసం నిరీక్షణ
- కలెక్టర్, డీపీవో దృష్టికి తీసుకెళ్లినా అందని జీతాలు
- రకరకాల సాకులతో సాగదీస్తున్న పంచాయతీ అధికారులు
- అదిగో ఇదిగో అంటూ నెలల తరబడి సాగదీత
- ప్యూరిఫైడ్ వాటర్ కోసం పట్టణ ప్రజలకు తప్పని ఇక్కట్లు


పీలేరులో మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న దృశ్యం


పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పీలేరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేసే వర్కర్లు 13 నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధులు అదిగో ఇదిగో అంటున్నారే కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలు ఎలా గడవాలని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలనే ఆశయంతో పీలేరు పట్టణంలో 26 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. సుమారు 55 వేల పైచిలుకు జనాభా ఉన్న పట్టణ ప్రజలకు ఉచితంగా ప్యూరిఫైడ్ వాటర్ దశాబ్ద కాలంగా అందిస్తున్నారు. నిత్యం ఇంటికి ఒకట్రెండు 20 లీటర్ల క్యాన్లతో మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నారు. పట్టణ ప్రజలు రూ.20 వెచ్చించి ప్రైవేట్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల వద్ద కొనకుండా ఉచితంగా ఇస్తున్న పంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్‌ల వద్దే తాగునీరు తెచ్చుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 26 మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేసే వర్కర్లకు జీతాలు చెల్లించేవారు. ఇందులో 11 మందికి పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయ నిధుల నుంచి, మిగిలిన 15 మందికి డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ నుంచి నెలవారీ జీతాలు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందులో కొత్తవారిని నియమించారు. వారికి మూడు నెలలు జీతాలు చెల్లించారు. అనంతరం జీతాలు చెల్లించలేదు.


మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్

నిధులు దుర్వినియోగమయ్యాయని...

పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు రావడంతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు అధ్యక్షతన విచారణ కమిటీ వేసి నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించారు. ఇందులో సుమారు రూ.1.50 కోట్లు పక్కదారి పట్టినట్లు అధికారుల విచారణలో తేల్చారు. దీంతో పీలేరు సర్పంచ్ ఎస్.హబీబ్‌బాషా, ఇన్‌చార్జ్ సర్పంచ్ జీనత్ సఫీల చెక్‌పవర్ రద్దు చేశారు. వీరితో పాటు గతంలో ఈవోలుగా పనిచేసిన ముగ్గురిని సస్పెండ్ చేశారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంలో పలు కారణాలు చూపారు. ఇందులో మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు కలెక్టర్, డీపీవో అనుమతి లేకుండానే పంచాయతీ నిధుల నుంచి జీతాలు చెల్లించడం నిధుల దుర్వినియోగంగా గుర్తించారు. దీంతో మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు నెలనెలా ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా ఆపేశారు. జిల్లా ఉన్నతాధికారులు, పంచాయతీ పాలకవర్గం ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండానే 13 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలెక్టర్ నుంచి పీలేరు పంచాయతీ ఈవో వరకూ అందరి దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి పురోగతి కానరావడం లేదని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నీటిని వాటర్‌ప్లాంట్లను సరిగ్గా తెరవకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

మరోవైపు పంచాయతీ పాలకవర్గం ఆమోదం మేరకు పట్టణంలోని 26 మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు జీతాల చెల్లింపు కోసం అనుమతి ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే దీనిపై కలెక్టర్ పంచాయతీ నిధుల నుంచి జీతాలు ఇవ్వడం కుదరదని, మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఆపరేటర్ జీతాలు, ఇతర అవసరాల కోసం మినిమం రుసుం 20 లీటర్ల క్యాన్‌కు వసూలు చేసుకోవాలని బదిలీపై వెళ్లిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో వర్కర్ల జీతాల చెల్లింపు విషయం మరింత జటిలంగా మారింది.

పెండింగ్ జీతాలు చెల్లించాలని...

పీలేరు పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్‌కు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి లేఖ రాశారు. వర్కర్లను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే పీలేరు అభివృద్ధి కమిటీ మొదటి సమావేశంలోనూ పెండింగ్ జీతాల విషయమై చర్చించారు. అయినా ఇంతవరకు అందులో ఎటువంటి పురోగతి లేదు.

సక్రమంగా మినరల్ వాటర్ అందించాలి...



పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ అందించాలి. వర్కర్లకు రావాల్సిన పెండింగ్ జీతాలు ఇప్పించడం కోసం ప్రత్యేక చొరవ చూపుతాం. వర్కర్లు ఇబ్బంది పడాల్సిన అవసరం రానివ్వం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

- ఆనందస్వామి, టీడీపీ నేత, పీలేరు.

ఎమ్మెల్యేతో చర్చిస్తాం...



మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్ల పెండింగ్ జీతాలు చెల్లించేలా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో చర్చిస్తాం. వీలైనంత త్వరగా జీతాలు అందించడం కోసం ప్రత్యేక చొరవ చూపుతాం. వర్కర్ల ఇబ్బందులు అర్థం చేసుకోగలం. త్వరలోనే న్యాయం చేసేందుకు ముందుకు పోతాం.

-కలప రవి, ఏఎంసీ డైరెక్టర్, జనసేన జిల్లా కార్యదర్శి, పీలేరు.

వాల్మీకి రామాయణం అందరికీ ఆదర్శం

జయంతి వేడుకల్లో అదనపు ఎస్పీ వెంకటాద్రి


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి రచించిన రామాయణం సమస్త మానవాళికి ఆదర్శనీయమని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యుగాలు మారినా చెక్కుచెదరని కుటుంబ విలువలు, ధర్మం, మానవ సంబంధాలను బోధించే ఉన్నతమైన ఆదర్శ కావ్యంగా రామాయణాన్ని వాల్మీకి మహర్షి సమాజానికి అందించారన్నారు. రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకోవాలని, ధర్మబద్ధంగా జీవించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.పెద్దయ్య, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణరెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించారు.

రాష్ట్ర పోటీలకు మట్లి పెద్దూరు విద్యార్థి


పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

వీరబల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మట్లి పెద్దూరు విద్యార్థి పెద్దివీటి పవన్‌కుమార్ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న, ఫిజికల్ డైరెక్టర్ జగదీశ్వరయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పెద్దివీటి పవన్‌కుమార్‌ను, పీడీ జగదీశ్వరయ్యను మంగళవారం పాఠశాలలో అభినందించారు.

చెస్‌లో కన్నెమడుగు విద్యార్థుల ప్రతిభ



జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తంబళ్లపల్లె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్ స్థాయి చెస్ పోటీల్లో కన్నెమడుగు హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాష తెలిపారు. మంగళవారం సీటీఎం హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో చెస్ పోటీలు నిర్వహించారు. సుమారు 15 మండలాల నుంచి విద్యార్థులు పాల్గొనగా వీరిలో కన్నెమడుగు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థిని కే.వర్షిత, 8వ తరగతి విద్యార్థిని కె.ధరణి సత్తా చాటి జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ బాలికల విభాగం అండర్-14లో స్వాతి, ఇందుప్రియ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం మదన్‌మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయికి కొత్తపేట విద్యార్థిని

పుల్లంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్-19 బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు మండల పరిధిలోని కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.హారిక ఎంపికైనట్లు పీడీలు బాలశేఖర్, సాయిరాం తెలిపారు. మంగళవారం మైదుకూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో తూర్పు గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఆలీ అక్బర్, ఉపాధ్యాయ బృందం హారికను అభినందించారు.

శ్రీగంధం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారులు

మదనపల్లె టౌన్/బి.కొత్తకోట అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం మొగసాలమర్రి గ్రామం వద్ద అక్రమంగా శ్రీగంధం చెక్కలను కలిగి వున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు తెలిపారు. సోమవారం రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు హార్సిలీహిల్స్ ఎఫ్ఎస్‌వో శివకుమార్ ఆధ్వర్యంలో మొగసాలమర్రి వద్ద తనిఖీ చేపట్టారు. ఇందులో అదే గ్రామానికి చెందిన జి.శ్రీనివాసులు, ఇట్నేనివారిపల్లెకు చెందిన టి.శివకుమార్ వద్ద రూ.35 వేలు విలువైన 10.3 కిలోల శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎఫ్‌బీఓలు జయరామ్, సుమిత, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మెకానిక్ పోస్టులు

- *దరఖాస్తు చేసుకోండి : డిపో మేనేజర్*

రాయచోటిటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని ఆర్టీసీ డిపోలో అదనపు మెకానిక్‌లుగా కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయచోటి డిపో మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐటీఐ డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు రాయచోటి డిపోలో అదనపు మెకానిక్‌లుగా కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనిచేసేందుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రాయచోటిలోని డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆటో చోరీ కేసులో నిందితులకు జైలు



ఆటో చోరీ కేసులో శిక్షపడ్డ నిందితులతో పోలీసులు

పుల్లంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని బైపాస్ రోడ్డులో 2020లో జరిగిన ఆటో చోరీ కేసులో నిందితులకు జైలుశిక్ష విధిస్తూ నందలూరు మేజిస్ట్రేట్ ఉదయ్‌ప్రకాష్ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. బైపాస్ రోడ్డులోని నాయుడు హోటల్ దగ్గర నిలిపి ఉంచిన ఆటో దొంగిలించినట్లు అప్పట్లో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం కడపకు చెందిన సయ్యద్, అబ్దుల్లాకు ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కలకడ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణయ్య (65) మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మండలంలోని గోపాలపురం వాసి రమణయ్య టమోటా తోట వద్ద పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై బాటవారిపల్లి హంద్రీనీవా కాలువ వద్ద పీలేరు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ ఆయనను 108లో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


సీటీఎం హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. బుధవారం సీటీఎం హైస్కూల్‌లో మదనపల్లె డివిజన్ స్కూల్ గేమ్స్ క్రీడలు ప్రారంభించారు. అండర్-14, 17 బాలబాలికల కబడ్డీ, చెస్ పోటీలు నిర్వహించారు. డివిజన్‌లో సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సీటీఎం హైస్కూల్ హెచ్‌ఎం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఇక్కడ విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డివిజన్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ భద్రయ్య, శివశంకర్, దిలీప్, నరేష్, మహేంద్రనాయక్, బాలాజీ, విజయ్ కుమార్ సుధాకర్, లక్ష్మీ, భారతి పాల్గొన్నారు.

దశాబ్దాల శ్మశాన వాటిక సమస్య పరిష్కారం


గ్రామస్థులు, నాయకులతో చర్చిస్తున్న తహసీల్దారు శివకుమార్

పీలేరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుల చొరవ, తహసీల్దారు కృషితో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తలపుల పంచాయతీ దళితవాడ శ్మశాన వాటిక సమస్య మంగళవారం పరిష్కారమైంది. గతంలో శ్మశాన వాటిక కోసం తమ గ్రామానికి దూరంగా గుట్టల్లో స్థలాన్ని కేటాయించారని, అక్కడకు చేరుకోవడమే కాకుండా అంత్యక్రియలు నిర్వహించేందుకు కష్టంగా ఉందంటూ దళితవాడ వాసులు దశాబ్దాలుగా అధికారులను కోరుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పీలేరు రెవెన్యూ అధికారులు శ్మశాన వాటిక ఏర్పాటు కోసం తలపుల పరిసరాల్లో అనువైన స్థలం కోసం పరిశీలన జరిపారు. దళితవాడ సమీపంలోనే, తలపుల-యల్లమంద ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నెంబర్-882లో 30 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. తహసీల్దారు శివకుమార్, డీవీఎంసీ సభ్యుడు బోదేషావలి, ఆర్ఐ మురగయ్య, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ నేత అబ్బవరం అమరనాథరెడ్డి గ్రామస్తులతో మంగళవారం చర్చించి వారిని ఒప్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శివకుమార్ మాట్లాడుతూ త్వరలోనే శ్మశాన వాటిక కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి అనుమతులు తీసుకుంటామని, అనుమతులు వస్తూనే ప్రహరీ, దారి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. తమ గ్రామ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నందుకు గ్రామస్తులు అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విదేశీ కరెన్సీ పేరుతో బురిడీ

- న్యూస్ పేపర్ల కాగితాల కట్ట చేతిలో పెట్టి రూ.4.50 లక్షలతో ఉడాయించారు
- 2 గంటల్లో ముఠాను పట్టుకున్న పోలీసులు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో విదేశీ కరెన్సీ పేరుతో ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి న్యూస్ పేపర్ల కట్టను గుడ్డలో కట్టి అతడి చేతిలో పెట్టి రూ.4.50 లక్షలతో ఓ చీటింగ్ ముఠా ఉడాయించింది. ఫిర్యాదు అందిన 2 గంటల్లో ఢిల్లీకి చెందిన ముఠాను రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ వివరాలు తెలిపారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన షేక్ హరూన్, ఇరాజ్, నూర్ మహమ్మద్‌ఖాన్‌లు ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పలు రకాల చీటింగ్‌లకు పాల్పడుతూ అమాయకులను మోసం చేసే వారని తెలిపారు. ముఠా సభ్యులు ముగ్గురు కలిసి మంగళవారం రాయచోటి పట్టణంలోని షాపుల వద్దకు వెళ్లి ఏదో ఒక వస్తువు కొనుగోలు చేయడంతో పాటు హిందీలో వారితో మాట్లాడుతూ పరిచయం పెంచుకుని మా వద్ద దుబాయ్ కరెన్సీ నోటు 100 రూపాయలవి ఉన్నాయని, ఒక్క నోటు విలువ ఇండియాలో 2400 ఉంటుందని, మా దగ్గర ఎక్కువ మొత్తంలో నోట్లు ఉన్నాయని, ఇండియా డబ్బు వెయ్యి రూపాయలు ఇస్తే దుబాయ్ కరెన్సీ వంద నోటు ఇస్తామని షాప్ యజమానులను నమ్మిస్తారన్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు దారుడు ఈ చీటింగ్ ముఠా మాయమాటలు నమ్మి అరగంట వ్యవధిలోనే రూ.4.50 లక్షలు డబ్బులు సమకూర్చుకొని నిందితులు చెప్పినట్లు కడప రింగు రోడ్డు వద్దకు వెళ్లగా అక్కడ షాపు వద్దకు వచ్చిన వ్యక్తితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి ఫిర్యాదుదారుడి వద్ద నుంచి డబ్బులు తీసుకుని అప్పటికే వారి వద్ద సిద్ధంగా ఉంచుకున్న న్యూస్ పేపర్ల కట్టను లుంగీలో కట్టి అతడి చేతిలో పెట్టి అక్కడ నుంచి జారుకున్నట్లు తెలియజేశారు. పేపర్ల కట్టకు రెండు వైపులా రెండు విదేశీ కరెన్సీ నోట్లు పెట్టి మోసం చేశారన్నారు. కొద్దిసేపటి అనంతరం ఫిర్యాదుదారుడు వారు ఇచ్చిన కట్టను విప్పి చూస్తే అందులో గుండ్రంగా చుట్టిన న్యూస్ పేపర్ల కట్టతో పాటు రెండు ఒరిజినల్ దుబాయ్ కరెన్సీ నోట్లు తప్ప ఏమీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే రాయచోటి అర్బన్ సీఐ వెంకటచలపతి, ఎస్ఐ బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ అమర్‌నాథ్, కానిస్టేబుల్స్ బాబ్జి, రామకృష్ణ, స్పెషల్ పార్టీ సిబ్బంది శ్రీను, మల్లికార్జునలు గాలింపు ముమ్మరం చేశారని తెలిపారు. నిందితులు సుండుపల్లె రింగు రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.50 లక్షల నగదును రికవరీ చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు డీఎస్పీ వివరించారు. ఫిర్యాదు అందిన తక్షణం స్పందించి రెండు గంటల్లో నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన సిబ్బందిని డీఎస్పీ అభినందించడంతో పాటు రివార్డుల కోసం ఎస్పీకి విన్నవించినట్లు తెలిపారు.

జవహర్ నవోదయకు దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె (ఆకేపాడు) జవహర్ నవోదయలో 2026-27 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతిలో చేరే విద్యార్థులు ఈనెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 2026 ఫిబ్రవరి 7వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు నవోదయ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

మద్దినాయనిపల్లెలో బెల్ట్‌షాపుపై దాడులు

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దినాయనిపల్లెలో మంగళవారం బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తలారీ సుధాకర్(55)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్‌షాపులు పెట్టి మద్యం అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పాఠశాలలకు.. స్వచ్ఛాంధ్ర రాష్ట్ర పురస్కారాలు


కడప జిల్లా గుండ్లకుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు స్వచ్ఛ అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి పురస్కారాలు ఉమ్మడి కడప జిల్లాలోని మూడు పాఠశాలలకు దక్కాయి. సంబంధిత అధికారులు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందుకున్నారు.



పుల్లంపేటలోని బాలుర ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ కాంప్లెక్స్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న అధికారులు

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

● తపాల ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ రాజేశ్



కడప మారుతీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ పోస్టల్ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 6 నుంచి 10 వర కు కడప డివిజను వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప తపాల ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ రాజేశ్ కోరారు. మంగళవారం స్థానిక తపాల ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. ఈక్యాంపులను వివిధ పోస్టాఫీసులు, ఎంపిక చేసిన ప్రభుత్వ ప్రదేశాల్లో (పాఠశాలలు, నివాస కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు) ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ నివాసాలకు దగ్గరగా ఉన్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో కడప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, 10, 11న కడప బాలికల ఉర్దూ పాఠశాలలో, 13, 14న కడప అల్మాస్‌పేట, సాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు సేవలు ఉంటా యన్నారు. ఇందులో 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాలు వయసు గల పిల్లలకు ఉచితంగా బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలందిస్తారన్నారు. ప్రజలందరూ తప్పక సరిచేసుకోవాలని కోరారు.

ప్రమాద రహిత డ్రైవర్లుగా పేరు తెచ్చుకోండి

● డ్రైవర్ల శిక్షణ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి



కడప మారుతీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో విధులు నిర్వహించే ప్రతి డ్రైవరు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధతో బస్సులు నడిపి ప్రమాద రహిత డ్రైవర్లుగా పేరు తెచ్చుకోవాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌ఎం కార్యాలయంలో గల సభాభవనంలో డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం ప్రమాదాల నివారణకు పంచసూత్రాలను డ్రైవర్లకు బోధించారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు


● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

చెన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఉద్యోగులు మాత్రమే కాదని సమాజ నిర్మాతలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న మెగా డీఎస్సీ -2025 నూతన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యకు ప్రాధాన్యం ఇచ్చి తొలి సంతకం మెగా డీఎస్సీపై చేయడం విద్యాభివృద్ధిపై ఆయన నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషితో కేవలం 150 రోజుల్లోనే నియామక ప్రక్రియ పూర్తి కావడం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా అభివర్ణించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకత, నైతిక విలువలు పెంచిమంచి పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. డిజిటల్ క్లాసరూమ్స్‌స్మార్ట్ బోధన పద్ధతులతో విద్యారంగంలో సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ షంషుద్దీన్, ఏపీసీ నిత్యానందరాజులు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంఈఓలు వెంకటేష్, సుభాషిణి, రఫీక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీకేదిన్నె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంపూర్ణాభివృద్ధికి మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని జిల్లా ఏపీసీ నిత్యానందరాజులు తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు జిల్లా జీసీడీవో దార్ల రూతు ఆరోగ్యమేరీ మానసిక ఆరోగ్యం, ఆహార అలవాట్లపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిల్ప, డాక్టర్ నాగభూషణంలు మానసికంగా, ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలన్నారు. అదే విధంగా మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో వీరేంద్ర, ఏఎస్‌వో సంజీవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు గంగాధర్ ఉమామహేశ్వరి, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంకాల శైలజకు గోల్డ్‌మెడల్



శైలజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ విద్యార్థిని అంకాల శైలజకు (ఎంకాం 2022-24 బ్యాచ్) తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ బయపురెడ్డి విద్యార్థిని అభినందించారు.

ఆర్టీపీపీ కాలుష్యం నుంచి కాపాడండి

● ఏపీ జెన్‌కో డైరెక్టర్‌కు కలమల్లవాసుల వినతి

ఎర్రగుంట్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ కాలుష్యం నుంచి తమను రక్షించాలని కలమల్లవాసులు ఏపీ జెన్‌కో థర్మల్ డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఆర్టీపీపీకి వచ్చిన సందర్భంగా వారు ఆయను కలిసి ఇక్కడ నెలకొన్న సమస్యలను విన్నవించారు. ఆర్టీపీపీ నుంచి వచ్చే బూడిదతో ఇళ్లలో సర్వం కలుషితమవుతున్నాయని, వీటివల్ల అనేక రకాల జబ్బులు వస్తున్నాయన్నారు. శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, కళ్ల దురదలు రోజురోజుకు అధికమవుతున్నాయన్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక ఎక్కడ పడితే అక్కడ బూడిదను డంపింగ్ చేయడం, లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తుండడంతో కాలుష్యం పెరుగుతోందన్నారు. ఆర్టీపీపీలోని 600 మెగావాట్ల నుంచి కెమికల్ కాలుష్యాన్ని వంకలోకి వదలడంతో అది ఇళ్లలోకి వస్తోందన్నారు. ఆర్టీపీపీ చుట్టూ ఉన్న కాలుష్యం, వాటివల్ల కలిగే నష్టాలు, కష్టాలపై ఫొటోలతో సహా డైరెక్టర్‌కు వివరించారు. ఇక రాత్రిపూట కారుచీకటి ఉన్నందున వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు తరచు వైద్యపరీక్షలు నిర్వహించి వ్యాధుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని కలమల్లవాసులు పేర్కొన్నారు.



జెన్‌కో డైరెక్టర్‌ను కలిసిన కలమల్లవాసులు

ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఏపి జెన్‌కో థర్మల్ డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని 1535 యూనియన్ నాయకులు మంగళవారం కలిశారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఈ వాసుదేవ రావు, ఎస్ఈలు సోమశేఖర్‌రెడ్డి, క్రిష్ణమోహన్‌రెడ్డి, యూనియన్ నాయకులు రామక్రిష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, రమణయ్య, జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చెన్నకేశవులు, మధుసూ దన్ రావు, సురేంద్రబాబు డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

జీఎస్టీ వైద్య ఫలాలు పేదలకు అందాలి



సంధ్య సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

కడప కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీ ఫలాలు పేదలతో పాటు అన్ని వర్గాలకు అందాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి సంధ్య సర్కిల్ వరకు సాగి అక్కడ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలు పేదలతో పాటు అన్న వర్గాలకు మరింత అందుబాటులోకి వైద్య సేవలు వచ్చాయన్నారు. వ్యక్తిగత ఆరోగ్య భవిత బీమా పాలసీ ప్రీమియంపై 18శాతం నుంచి పన్ను పూర్తిగా తగ్గిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులపై, డయాగ్నోస్టిక్ టెస్ట్ కిట్స్‌పై కూడా పన్ను జీరో శాతం చేశారన్నారు. ఈ సమాచారంపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనరు పద్మావతి, డాక్టర్లు శశిభూషణ రెడ్డి, ఉమా మహేశ్వరకుమార్, రవిబాబు, వెంకటచంద్రారెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసరు, డెమా భారతి, డీఎంవో మనోరమ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

దువ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరెడ్డిపల్లెకు చెందిన ఇరగంరెడ్డి రామమోహన్‌రెడ్డి (29) గడ్డి మందు తాగి మృతి చెందినట్లు ఏఎస్ఐ భూషణం తెలిపారు. బీటెక్ చదివిన రామమోహన్‌రెడ్డి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడం, అనారోగ్య కారణాలతో ఈనెల 5వ తేదీ విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి అంకిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో సీఐ మృతి

● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ముద్దనూరు అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఆనారోగ్యంతో మృతి చెందిన సీఐ జాన్సన్‌బాబురావు(49)కు మంగళవారం ముద్దనూరులో పోలీసులు అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జాన్సన్‌బాబురావు స్వగ్రామం ముద్దనూరు మండలం నల్లబల్లె గ్రామం. 2002 సంవత్సరంలో ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తరువాత సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో తాత్కాలికంగా వీఆర్‌లో ఉన్నారు. మృతదేహాన్ని సొంతగ్రామం నల్లబల్లెకు తీసుకువచ్చి, ముద్దనూరులోని సీఎస్ఐ చర్చి వద్ద నున్న శ్మశాన వాటిలో పోలీసులు తుపాకీతో గాలిలో పేల్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఘర్షణలో డ్రైవర్‌కు గాయాలు

దువ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ షేక్ మహమ్మద్ ప్రయాణికుడితో ఘర్షణ పడ్డారు. బస్సు నిండిపోయే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ప్యాసింజర్ డ్రైవర్‌ను గాయపరిచినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



వల్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వల్లూరు కేజీబీవీ కళాశాలకు చెందిన దర్శ అనూష రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఇంటర్మీడియట్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్న అనూష మైదుకూరులో మంగళవారం మేధా డిఫెన్స్ అకాడమీలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంది. హైజంప్‌లో ప్రతిభ చాటి మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాజీమునీసా, కళాశాల పీడీ రూతు, సిబ్బంది అనూషని అభినందించారు.

అభాగ్యురాలికి ఆశ్రయం

కాశినాయన అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీపంలోని అటవీప్రాంతంలో ఉన్న యానాది కాలనీలో అడవిపై ఆదార పడిజీవించే లక్ష్మమ్మ అనే నిరుపేద వృద్ధురాలైన మహిళకు ఓబుళాపురంలోని వివేకానంద సేవాశ్రమ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామక్రిష్ణారెడ్డి ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. వృద్ధురాలికి నా అనే వారు (పిల్లలు లేరు, భర్త చనిపోయాడు) ఏవరూ లేరని, తినడానికి ఉండటానికి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు రామక్రిష్ణారెడ్డికి తెలుపగా ఆయన మంగళవారం వివేకానంద సేవాశ్రమానికి ఆమెను తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఈసందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఏఆదరణలేని అభాగ్యులకు తమ సేవాశ్రమం ద్వారా ఉచితంగా ఆశ్రయం కల్పిస్తామన్నారు.

వృద్ధురాలిని మభ్యపెట్టి
బంగారు నగలు, నగదు అపహరణ



కొప్పర్తిలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

సీకేదిన్నె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్తి గ్రామంలో కోగటం సరస్వతమ్మ అనే వృద్ధురాలిని అగంతకులు మభ్యపెట్టి 10 తులాలు బంగారు నగలు, రూ.50 వేలుపైగా నగదు అపహరించినట్లు చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు.. కోగటం సరస్వతమ్మకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు మగపిల్లలు, ఆడపిల్ల కాగా మగపిల్లలు హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె, అల్లుడు కడప నగరంలో నివాసం ఉంటున్నారు. ఇంటి మిద్దె పైభాగంలో కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో ఉద్యోగం చేసే ఒక వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి, ఇద్దరు బయట ఉండగా ఓ వ్యక్తి పెళ్లిపత్రిక ఇచ్చే క్రమంలో లోనికి వెళ్లి పై నుండే వ్యక్తి గురించి అడుగగా అతను ఈ సమయంలో ఉండరని తెలిపింది. అయితే వచ్చిన వ్యక్తి కార్డుపై పేరు రాసిస్తాను, పెన్ను ఇవ్వాల్సిందిగా అడుగగా అప్పటికే అన్నం తింటున్న ఆమె పెన్ను తెచ్చేందుకు తిరిగి లోనికి వెళుతుండగా వచ్చిన వ్యక్తి ఆమెతోపాటే లోనికి వెళ్లి ఆమె నోరు గట్టిగా మూసి పక్కనే ఉన్న బెడ్‌రూములోకి తీసుకెళ్లాడు. అదే సమయంలో బయట ఉండే ఇద్దరు వ్యక్తులు కూడా లోనికి ప్రవేశించి ఆమె చేతులు వెనక్కు కట్టివేశారు. అనంతరం ఆమెను బెదిరించి ఆమె వద్ద ఉండే నాలుగు బంగారు గాజులు, సరడు, రెండు ఉంగరాలు, రెండు జతల కమ్మలు, తాళిబొట్టు, బీరువాలో నుంచి రూ.50 వేలకుపైగా నగదు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒంటరి మహిళలు, వృద్ధులు లక్ష్యంగా పెట్టుకుని దుండగులు ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని సీఐ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి పరిశీలించినట్లు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

మైలవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూగూసానిపల్లెలో స్థల విషయమై టీడీపీలోని ఇరువర్గాలు ఘర్షణ పడినట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు...

గ్రామంలోని క్రాస్‌రోడ్డు వద్ద స్థల విషయమై వివేకానంద రెడ్డితోపాటు మరో నలుగురు మరోవైపు సునీల్‌కుమార్‌తో పాటు గురుమోహన్‌రెడ్డి, మరికొందరు మాటమాట పెరిగి ఘర్షణ పడి రాళ్లు, కట్టెలతో దాడి చేసుకున్నారు. గాయపడిన వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని ఎర్రగుంట్ల రోడ్డు ఎకో పార్కు సమీపంలో పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో ఏడు గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.81వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

నేషనల్ యూత్ వలంటీర్ల ఎంపికకు దరఖాస్తు చేసుకోండి

కడప స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక సంవత్సరం పాటు సమాజసేవ చేసే నిమిత్తం అక్టోబరు 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఆసక్తి గల యువతీ యువకులు నేషనల్ యూత్ వలంటీరుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేరా యువ భారత్ జిల్లా యువ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఇందులో పనిచేసేందుకు ప్రస్తుతం చదువుతున్న వారు, ఉద్యోగం చేస్తున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులన్నారు. ఇది స్వచ్ఛంద సేవ మాత్రమే, ఉద్యోగం కాదని ఎంపికైన వలంటీర్లకు నెలకు రూ.5వేలు స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. ప్రధానంగా ఎంపికైన వారు యువజన సంఘాల స్థాపన, క్రీడలు, ఆరోగ్యం అక్షరాస్యత, పారిశుధ్యం, లింగ వివక్ష తదితర సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరిచి ప్రచారం చేసే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. కనీసం పదో తరగతి విద్యార్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పద్ధతిలో నేషనల్ కార్ప్స్ వెబ్‌సైట్‌లో ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు నెహ్రూ యువకేంద్ర కార్యాలయం కడపలో సంప్రదించాలన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సంబేపల్లె ఎస్ఐగా రవికుమార్

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఎస్ఐగా రవికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న భక్తవత్సలం తిరుపతికి బదిలీ అయ్యారు. రవికుమార్ గతంలో పుంగనూరు నియోజకవర్గం రామసముద్రం మండల ఎస్ఐగా పని చేశారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

గాలివీడు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్ గంగరాజు, ప్రధానోపాధ్యాయుడు జాఫర్ తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య పరిరక్షణ, జట్టు సహకార భావనను పెంపొందించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు.

14న వాహనాల వేలం

రాజంపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 14న ఉదయం స్థానిక ఆర్టీసీ డిపోలో వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారు వేలం పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చునని తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పెనగలూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి గ్రామంలో కోడూరు నీరజా అనే మహిళకు మంగళవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాష్ట్ర టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.1.25, 737 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మండల నాయకులు దాసరి దామోదర్‌నాయుడు, ఓబిలి పంచాయతీ టీడీపీ ఇన్‌చార్జి ఎస్.అమీరుల్లా, ఉపాధ్యక్షుడు ఎస్. నాగేంద్ర, మాజీ సర్పంచ్ హబీబుల్లా, మోపూరి శ్రీనివాసులు, డిష్ కరీముల్లా, సురేష్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

రేపు సుండుపల్లె మండల సమావేశం

సుండుపల్లె, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన గురువారం సుండుపల్లె మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సుధాకర్‌రెడ్డి మంగళ వారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం సభాభవనంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

కూలిన మెస్ గోడ

రైల్వేకోడూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబజారువీధిలో ఓ మెస్‌కు చెందిన గోడ మంగళవారం ఉత్నపళంగా కూలిపోయింది. ఆ సమయానికి మెస్‌లో ఎవరూ లేక పోవడంతో అపాయం తప్పింది. పాత గోడ కావడం, ఇటీవల కురిసిన భారీ వర్షానికి కూలిపోయి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు.

తాగునీరు, వీధిలైట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పెనగలూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తాగునీరు, వీధిలైట్ల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యమివ్వాలని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సూచించారు. మంగళవారం పెనగలూరు మండల పరిషత్ సభాభవనంలో ఎంపీపీ కొండూరు సౌందర్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయరావు ఎజెండాను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో తాగునీరు, వీధిలైట్ల సమస్య ప్రధానంగా తన దృష్టికి వస్తోందన్నారు. అధికారులు పంచాయతీ నిధులు సక్రమంగా వినియోగించి ఉంటే ఈ రెండు సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావన్నారు. పంచాయతీల్లో నిధులు సరిపోకుంటే మండల పరిషత్ ద్వారానైనా వినియోగించుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిషారానికి పెద్దపీట వేస్తుందని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి సూచనల ప్రకారం గ్రామాల్లో లింకు రోడ్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. పెనగలూరు లేఅవుట్‌లో రోడ్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ కోరారు. కట్టవారి ఎల్లెలో ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులు తమ ఆధీనంలో ఉన్న గ్రామ కంఠం భూమిలో పునాదులు నిర్మించుకుని, పక్కా గృహాల కోసం ఎదురు చూస్తుంటే స్థానిక తహసీల్దారు వారికి అనుభవ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గత రెండు సమావేశాల్లో ఈ విషయం ప్రస్తావించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలు ఎం.బుక్‌లో రికార్డు చేయకుండా పీఆర్ ఏఈ నెలల తరబడి తిప్పుకుంటుండడం బాధాకరమన్నారు. కాగా, మండలంలో ఎటువంటి సమస్యలు లేవని, అన్నీ సవ్యంగానే ఉన్నాయని ఎంపీడీవో చెప్పడం విశేషం. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు కొండూరు విజయ్‌రెడ్డి, బొడ్డు రోశయ్య, జడ్పీటీసీ సభ్యుడు యూపీ సుబ్బరాయుడు తహసీల్దారు అమరేశ్వరి, పలు శాఖల అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు గేటు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సోమవారం దాడికి ప్రయత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్ చర్యలకు నిరసనగా మంగళవారం రాయచోటి న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ధనుంజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీ. రెడిబాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఉన్న వ్యవస్థలు రాజ్యాంగబద్ధంగా నడవని సందర్భాల్లో న్యాయవ్యవస్థ కలుగజేసుకునే విధంగా రాజ్యాంగం ప్రత్యేక అధికారాలు కట్టబెట్టిందన్నారు. అలాంటి అత్యున్నత న్యాయవ్యవస్థకు ప్రథమ ప్రతినిధిగా ఉన్న న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం క్షమించరాని నేరమన్నారు. సీజేఐపై దాడికి ప్రయత్నించిన రాకేశ్‌కిశోర్ దేశంలో ఎక్కడా కూడా న్యాయవాద వృత్తి చేయకుండా నిషేధించడమే కాకుండా, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'మంత్రిపై బురద చల్లే యత్నాలు మానుకోవాలి'

రాయచోటిటౌన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం జాడ వైసీపీ నాయకుల పునాదుల నుంచి పుట్టిందేని, కల్తీ మద్యం తయారీలో వైసీపీ నాయకులు డిగ్రీ పట్టా పొందారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై వైసీపీ నేతలు బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు చంద్రబాబునాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేస్తున్న మేలు చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు చిల్లర ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో ఏం చేశారో మర్చిపోయి ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివారెడ్డి, జయరామిరెడ్డి, రోఫా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిశీలన

చిన్నమండెం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పంచాయతీ లోని మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంగళవారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యాల మండపం, యాగశాల నిర్మాణానికి దాతలు ముందుకు రావటంతో దేవదాయశాఖ అనుమతుల కోసం ఎస్టిమేషన్ పంపించామన్నారు. చిన్నమండెం తహసీల్దార్ నరసింహులు ను కలిసి దేవాదాయాఖ భూములకు సంబంధించిన ఆన్‌లైన్ వివరాలను సరిచేయాలని ఫిర్యాదు చేశారు.

రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

చిన్నమండెం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు క్రాస్ వద్ద రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ వాహనాలు తనిఖీ చేశారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని వాహనదారులకు వివరించారు.

అన్నమాచార్య అధ్యాపకులకు అవార్డులు

రాజంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు అధ్యాపకులకు గ్లోబల్ జ్ఞాన్ అకాడమి, కడప కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 6వ గ్లోబల్ ఇంటర్నేషనల్ బెస్ట్ టీచర్స్ అవార్డులను ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా అందజేశారు. ఈసీఈ ప్రొఫెసర్ ఎం.పద్మలలిత బెస్ట్ టీచర్. ఎ.సునీల్‌కు బెస్ట్ ప్లేస్‌మెంట్ టీచర్స్, బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అవార్డు డాక్టర్ బి.నాగముని, బెస్ట్ ట్రైనర్ అవార్డును ఎస్.పార్థసారథి అందుకున్నారు. విద్య, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు డాక్టర్ ఈజీ సమతానాయుడును తెలుగు రాష్ట్రాల అంబాసిడర్‌గా సత్కరించారు.

జ్వరాలతో మంచం పడుతున్న పల్లెలు

ఒంటిమిట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రజలు జ్వరాలతో అవస్థలు పడుతున్నారు. పెద్దకొత్తపల్లె, మాధవరం, మృకుండాశ్రమం తదితర ప్రాంతాల్లోని ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలకు వైద్యం కోసం కొందరు ఒంటిమిట్ట ఆసుపత్రికి వెళుతుండగా మరికొందరు కడప, మాధవరం ఆసుపత్రులకు వెళుతున్నారు. మంగళవారం పెద్దకొత్తపల్లెకు చెందిన పలువురు ఒంటిమిట్టలోని ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చారు. రెక్కాడితే గాని డొక్కాడని తాము జ్వరాల కారణంగా పనులకు పోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

గుంత బజారు వీధిలో రోడ్డుపైనే మురుగు

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని గుంత బజారు వీదిలో డ్రైనేజీ సరిగా లేకపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. కొళాయిలు మురుగు మధ్యలో ఉండడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వారుజిల్లా వైద్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్యకు మొరపెట్టుకున్నారు. దీంతో డీపీఎంవో, వైద్య సిబ్బంది వార్డులోకి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు



సుండుపల్లె: డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

సుండుపల్లె, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి టోర్నమెంట్, సెలెక్షన్స్ మంగళవారం ముగిశాయి. అండర్ 17, అండర్ 14 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ యోగా, చెస్‌తో పాటు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను రాజంపేట డివిజన్ స్థాయికి ఎంపిక చేసినట్లు సుండుపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాకీర్‌బేగం, ఎస్‌జీఎఫ్ఐ మండల కోఆర్డినేటర్, పీడీ రాధారాణి తెలిపారు. పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్రనాయక్, ఆంజనే యులు, మడితాడు, జీకేరాచపల్లె, గుంతరాచపల్లె ఉపాధ్యాయులు అరీఫుల్లా, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌నాయక్, శ్రీరాములునాయక్, రామాంజనేయులు రెడ్డిలు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ గౌరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు గ్లోరి కిరణ్ ఉజాల నేతృత్వంలో బాలబాలికలకు వేర్వేరుగా రన్నింగ్ రేస్, జావెలిన్‌త్రో, ఖోఖో పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సుస్మిత, జగన్, అభిషేక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రైల్వేకోడూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం. భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి పరివర్తన పొంది మహర్షిగా మార్పు చెందిన విధం స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు ఉపన్యాసకుడు దాసరి మోషే, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్, కళాశాల ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి. దయానందం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: రామాయణ రచయిత వాల్మీకి మహర్షి అని మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక లక్కిరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐసీసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్ఎండీ షఫీనాయక్, మండల టీడీపీ నాయకుడు మదన్ మోహన్, కృష్ణ, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయభాస్కర్,ముద్దుల రామచంద్రయ్య, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు బిల్లు ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల సభ్యులు

రాయచోటి-కలెక్టరేట్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పనిగంటలు పెంచుతూ చేసిన బిల్లును ఉపసంహరించుకోవాలని, మహిళలతో రాత్రివేళల్లో పనిచేయించడం మానుకోవాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏ. రామాంజులు, మణి డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట దర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల్లో మూడు షిఫ్టులు, రెండు షిఫ్టులుగా మారడంతో ప్రతి ముగ్గురిలో ఒకరి ఉపాధి పోతుందని, నిరుద్యోగులకు ఉపాధి అనేది కలగా మారిపోతుందన్నారు. పగలే మహిళలకు రక్షణ కల్పించలేని కూటమి ప్రభుత్వం రాత్రివేళల్లో మహిళలతో పనిచేయించడం మానుకోవాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త సర్వేలో అధిక పనిగంటల వల్ల 30 శాతం కార్మికుల్లో హృద్రోగ మరణాలు పెరుగుతున్నాయని, సుదీర్ఘ పనిగంటల వల్ల కార్మికుల్లో మానసిక సమస్యలు పెరుగుతాయని, సరుకుల క్వాలిటీ పడిపోయి అంతర్జాతీయ పోటీల్లో నిలబడలేక పోతున్నాయని తెలిపిందన్నారు. కార్మికుల కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయం వల్ల చిన్నాభిన్నం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు వెంకట్రామయ్య, సురేంద్రబాబు, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బీవీ రమణ, పీవీ రమణ, చెన్నయ్య, రాంబాబు, హరి, సిద్దమ్మతో పాటు మున్సిపల్ గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్వాడీ స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



విశ్రాంత ప్రిన్సిపాల్ శ్రీరాములు నాయుడును సత్కరిస్తున్న చమర్తి

రాజంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 91వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, విశ్రాంత ప్రిన్సిపాల్ నెట్టెం శ్రీరాములు నాయుడు, ఎస్వీ యూనివర్శిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ మురళీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు గ్రంధే సత్యం, టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, బ్రహ్మయ్యనాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ పాఠశాల అభివృద్ధికి కోట్ల రూపాయలు విలువైన స్థలాన్ని కేటాయించిన వారి గొప్పతనం వివరించారు. పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ ప్రతి పూర్వ విద్యార్థి తమవంతుగా పాఠశాల అభివృదికి కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాల దేవాలయం లాంటిదని ఉపాధ్యాయులు దేవుళ్లతో సమానమని కొనియాడారు.

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి : సబ్‌కలెక్టర్



రీసర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ భావన

పుల్లంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పక్కాగా నిర్వహించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ భావన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అప్పయ్యరాజుపేట పంచాయతీలో రీ సర్వేను పరిశీలించి, తహసీల్దారు పుల్లారెడ్డికి సూచనలు చేశారు. అనంతరం అనంతయ్యగారి పల్లె రెవెన్యూ విలేజ్‌లో సోలార్ ప్లాంటు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, మండల సర్వేయర్ శ్రీనివాసులు సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇష్టానుసారం గేటు వసూలు అన్యాయం'

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశువుల సంతల్లో, మార్కెట్‌యార్డుల్లో తగిన సౌకర్యాలు కల్పించకపోయినా, మార్కెట్ సెస్సు మాత్రం ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి ఆరోపించారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో పశువులు, మేకలు, గొర్రెల రైతులు మాట్లాడుతూ గేటు మొత్తం అధికంగా వసూలు చేయడం మంచిది కాదన్నారు. చిన్న జీవానికి రూ.30, పశువులకు రూ.54 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా, దళారులు అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారన్నారు.

పంపిణీకి సిద్ధంగా చీనీ, నిమ్మ మొక్కలు

రైల్వేకోడూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మోడల్ నర్సరీలో చీనీ, పెట్లూరు నిమ్మ మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, నర్సరీ అధికారి బీ. లోకేశ్ తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ తమ నర్సరీలో చీనీ అంటు మొక్కలు 80 వేలు, పెట్లూరు పులుసు నిమ్మ అంటు మొక్కలు 15 వేలు ఉన్నాయని తెలిపారు. రైతులు ఉద్యాన శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని మొక్కలను నాటుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చీనీ అంటు మొక్క ధర రూ. 55, నిమ్మ అంటు మొక్క ధర రూ. 25 గా నిర్ణయించామని తెలిపారు.

వైద్యుల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు

రైల్వేకోడూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏఐటీయూసీ, ఆశ వర్కర్ల యూనియన్లు వైద్యుల సమ్మెకు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు తదిరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం

సుండుపల్లె, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం మండలంలోని మడితాడు బెస్తపల్లి, తిమ్మసముద్రం, భాగంపల్లెల్లో వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రం అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారన్నారు. అగ్గితెగులు, సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించారన్నారు. ఈ ఉధృతిని తగ్గించేందుకు వరి పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేయాలన్నారు. మడుల్లో నీటిని పూర్తిగా తీసేసి ఆరేటట్లు చూడాలన్నారు. యూరియా వినియోగించరాదన్నారు. అధికారుల సూచన మేరకే పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ జిల్లా వనరుల కేంద్రం ఏవో రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాచపల్లి కాజ్‌వేకి మరమ్మతులు

సుండుపల్లె, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి దిగువ భాగంలో పింఛా నదిపై ఉన్న వంతెన మట్టికట్ట నీటి ప్రవాహానికి గోతులమయమైంది. శ్రీరామ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ దేరంగుల సిద్దులయ్య ఆర్థిక సహకారంతో ఈ కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేసినట్లు మాచిరెడ్డిగారిపల్లె టీడీపీ అధ్యక్షుడు రెడ్డినాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జయరాంనాయక్, వెంకట్రమణ, రాంమోహన్ పాల్గొన్నారు.

'రేషన్ బియ్యం కొనడం, అమ్మడం నేరం'

గాలివీడు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం కొనడం, అమ్మడం నేరమని ఎన్‌ఫోర్స్‌మెంట్ వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని చెక్కావాండ్లపల్లె రైస్‌మిల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి రైస్‌మిల్ వద్దకు వెళ్లగా నిర్వాహకులు ఎవ్వరూ లేకపోవడంతో, మంగళవారం ఉదయం తనిఖీ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎలాంటి అక్రమ బియ్యం నిల్వలు దొరకలేదని తెలిపారు.

డోరు లేకుండా ముగ్గురాయి తరలిస్తే చర్యలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): డోర్లు లేకుండా ముగ్గురాయి తరలిస్తున్న లారీలను ఎస్ఐ మహేష్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోరు వేసుకోకుండా ముగ్గురాయి తరలిస్తున్న లారీల కారణంగా వెనుక వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇలాంటి నాలుగు వాహనాలపై సోమవారం రాత్రి కేసులు నమోదు చేసి, జరిమానా విధించి వదిలిపెట్టినట్లు మంగళవారం వివరించారు. రోడ్డు భద్రత చర్యలు పాటించకుండా ప్రమాదాలకు కారణమయ్యే వాహనాలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశువుల సంత ప్రారంభం

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం పశువుల సంత ప్రారంభించినట్లు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎస్ఎండీ షఫీనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు గొర్రెలు, మేకలు, పశువులు అధిక సంఖ్యలో సంతకు వచ్చాయని రైతులు జీవాలను విక్రయించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు ప్రారంభించినప్పటి నుంచి ఇంతవరకు సంత నిర్వహించలేదని ఆయన అన్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు కృషి

వీరబల్లి, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ పాఠశాలలో అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతోనే గేటు అందజేసినట్లు టీడీపీ నాయకుడు తాటిగుంట్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాలకు తమ తాతగారి పేరిట స్థలం ఇచ్చామని, ప్రస్తుతం డెస్కులు అందజేశామన్నారు. అనంతరం ఆయనను హెచ్ఎం రెడ్డెయ్య, ఉపాధ్యాయులు సత్కరించారు. వివేకానంద పాఠశాల హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు

- 13 నెలలుగా జీతాల కోసం నిరీక్షణ
- కలెక్టర్, డీపీవో దృష్టికి తీసుకెళ్లినా అందని జీతాలు
- రకరకాల సాకులతో సాగదీస్తున్న పంచాయతీ అధికారులు
- అదిగో ఇదిగో అంటూ నెలల తరబడి సాగదీత
- ప్యూరిఫైడ్ వాటర్ కోసం పట్టణ ప్రజలకు తప్పని ఇక్కట్లు


పీలేరులో మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న దృశ్యం


పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పీలేరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేసే వర్కర్లు 13 నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధులు అదిగో ఇదిగో అంటున్నారే కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలు ఎలా గడవాలని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలనే ఆశయంతో పీలేరు పట్టణంలో 26 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. సుమారు 55 వేల పైచిలుకు జనాభా ఉన్న పట్టణ ప్రజలకు ఉచితంగా ప్యూరిఫైడ్ వాటర్ దశాబ్ద కాలంగా అందిస్తున్నారు. నిత్యం ఇంటికి ఒకట్రెండు 20 లీటర్ల క్యాన్లతో మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నారు. పట్టణ ప్రజలు రూ.20 వెచ్చించి ప్రైవేట్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల వద్ద కొనకుండా ఉచితంగా ఇస్తున్న పంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్ల వద్దే తాగునీరు తెచ్చుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 26 మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేసే వర్కర్లకు జీతాలు చెల్లించేవారు. ఇందులో 11 మందికి పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయ నిధుల నుంచి, మిగిలిన 15 మందికి డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ నుంచి నెలవారీ జీతాలు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందులో కొత్తవారిని నియమించారు. వారికి మూడు నెలలు జీతాలు చెల్లించారు. అనంతరం జీతాలు చెల్లించలేదు.

నిధులు దుర్వినియోగమయ్యాయని...

పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు రావడంతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు అధ్యక్షతన విచారణ కమిటీ వేసి నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించారు. ఇందులో సుమారు రూ.1.50 కోట్లు పక్కదారి పట్టినట్లు అధికారుల విచారణలో తేల్చారు. దీంతో పీలేరు సర్పంచ్ ఎస్.హబీబ్‌బాషా, ఇన్‌చార్జ్ సర్పంచ్ జీనత్ సఫీల చెక్‌పవర్ రద్దు చేశారు. వీరితో పాటు గతంలో ఈవోలుగా పనిచేసిన ముగ్గురిని సస్పెండ్ చేశారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంలో పలు కారణాలు చూపారు. ఇందులో మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు కలెక్టర్, డీపీవో అనుమతి లేకుండానే పంచాయతీ నిధుల నుంచి జీతాలు చెల్లించడం నిధుల దుర్వినియోగంగా గుర్తించారు. దీంతో మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు నెలనెలా ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా ఆపేశారు. జిల్లా ఉన్నతాధికారులు, పంచాయతీ పాలకవర్గం ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండానే 13 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలెక్టర్ నుంచి పీలేరు పంచాయతీ ఈవో వరకూ అందరి దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి పురోగతి కానరావడం లేదని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నీటిని వాటర్‌ప్లాంట్లను సరిగ్గా తెరవకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

మరోవైపు పంచాయతీ పాలకవర్గం ఆమోదం మేరకు పట్టణంలోని 26 మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు జీతాల చెల్లింపు కోసం అనుమతి ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే దీనిపై కలెక్టర్ పంచాయతీ నిధుల నుంచి జీతాలు ఇవ్వడం కుదరదని, మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఆపరేటర్ జీతాలు, ఇతర అవసరాల కోసం మినిమం రుసుం 20 లీటర్ల క్యాన్‌కు వసూలు చేసుకోవాలని బదిలీపై వెళ్లిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో వర్కర్ల జీతాల చెల్లింపు విషయం మరింత జటిలంగా మారింది.


మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్

పెండింగ్ జీతాలు చెల్లించాలని...

పీలేరు పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్‌కు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి లేఖ రాశారు. వర్కర్లను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే పీలేరు అభివృద్ధి కమిటీ మొదటి సమావేశంలోనూ పెండింగ్ జీతాల విషయమై చర్చించారు. అయినా ఇంతవరకు అందులో ఎటువంటి పురోగతి లేదు.

సక్రమంగా మినరల్ వాటర్ అందించాలి...



పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ అందించాలి. వర్కర్లకు రావాల్సిన పెండింగ్ జీతాలు ఇప్పించడం కోసం ప్రత్యేక చొరవ చూపుతాం. వర్కర్లు ఇబ్బంది పడాల్సిన అవసరం రానివ్వం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

- ఆనందస్వామి, టీడీపీ నేత, పీలేరు.

ఎమ్మెల్యేతో చర్చిస్తాం...



మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్ల పెండింగ్ జీతాలు చెల్లించేలా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో చర్చిస్తాం. వీలైనంత త్వరగా జీతాలు అందించడం కోసం ప్రత్యేక చొరవ చూపుతాం. వర్కర్ల ఇబ్బందులు అర్థం చేసుకోగలం. త్వరలోనే న్యాయం చేసేందుకు ముందుకు పోతాం.

-కలప రవి, ఏఎంసీ డైరెక్టర్, జనసేన జిల్లా కార్యదర్శి, పీలేరు.

వాల్మీకి రామాయణం అందరికీ ఆదర్శం

జయంతి వేడుకల్లో అదనపు ఎస్పీ వెంకటాద్రి


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి రచించిన రామాయణం సమస్త మానవాళికి ఆదర్శనీయమని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యుగాలు మారినా చెక్కుచెదరని కుటుంబ విలువలు, ధర్మం, మానవ సంబంధాలను బోధించే ఉన్నతమైన ఆదర్శ కావ్యంగా రామాయణాన్ని వాల్మీకి మహర్షి సమాజానికి అందించారన్నారు. రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకోవాలని, ధర్మబద్ధంగా జీవించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.పెద్దయ్య, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణరెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించారు.

రాష్ట్ర పోటీలకు మట్లి పెద్దూరు విద్యార్థి


పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

వీరబల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మట్లి పెద్దూరు విద్యార్థి పెద్దివీటి పవన్‌కుమార్ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న, ఫిజికల్ డైరెక్టర్ జగదీశ్వరయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పెద్దివీటి పవన్‌కుమార్‌ను, పీడీ జగదీశ్వరయ్యను మంగళవారం పాఠశాలలో అభినందించారు.

చెస్‌లో కన్నెమడుగు విద్యార్థుల ప్రతిభ


జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తంబళ్లపల్లె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్ స్థాయి చెస్ పోటీల్లో కన్నెమడుగు హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాష తెలిపారు. మంగళవారం సీటీఎం హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో చెస్ పోటీలు నిర్వహించారు. సుమారు 15 మండలాల నుంచి విద్యార్థులు పాల్గొనగా వీరిలో కన్నెమడుగు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థిని కే.వర్షిత, 8వ తరగతి విద్యార్థిని కె.ధరణి సత్తా చాటి జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ బాలికల విభాగం అండర్-14లో స్వాతి, ఇందుప్రియ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం మదన్‌మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయికి కొత్తపేట విద్యార్థిని

పుల్లంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్-19 బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు మండల పరిధిలోని కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.హారిక ఎంపికైనట్లు పీడీలు బాలశేఖర్, సాయిరాం తెలిపారు. మంగళవారం మైదుకూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో తూర్పు గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఆలీ అక్బర్, ఉపాధ్యాయ బృందం హారికను అభినందించారు.

శ్రీగంధం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారులు

మదనపల్లె టౌన్/బి.కొత్తకోట అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం మొగసాలమర్రి గ్రామం వద్ద అక్రమంగా శ్రీగంధం చెక్కలను కలిగి వున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు తెలిపారు. సోమవారం రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు హార్సిలీహిల్స్ ఎఫ్ఎస్‌వో శివకుమార్ ఆధ్వర్యంలో మొగసాలమర్రి వద్ద తనిఖీ చేపట్టారు. ఇందులో అదే గ్రామానికి చెందిన జి.శ్రీనివాసులు, ఇట్నేనివారిపల్లెకు చెందిన టి.శివకుమార్ వద్ద రూ.35 వేలు విలువైన 10.3 కిలోల శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎఫ్‌బీఓలు జయరామ్, సుమిత, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మెకానిక్ పోస్టులు

- **దరఖాస్తు చేసుకోండి : డిపో మేనేజర్**

రాయచోటిటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని ఆర్టీసీ డిపోలో అదనపు మెకానిక్‌లుగా కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయచోటి డిపో మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐటీఐ డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు రాయచోటి డిపోలో అదనపు మెకానిక్‌లుగా కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనిచేసేందుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రాయచోటిలోని డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆటో చోరీ కేసులో నిందితులకు జైలు


ఆటో చోరీ కేసులో శిక్షపడ్డ నిందితులతో పోలీసులు

పుల్లంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని బైపాస్ రోడ్డులో 2020లో జరిగిన ఆటో చోరీ కేసులో నిందితులకు జైలుశిక్ష విధిస్తూ నందలూరు మేజిస్ట్రేట్ ఉదయ్‌ప్రకాష్ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. బైపాస్ రోడ్డులోని నాయుడు హోటల్ దగ్గర నిలిపి ఉంచిన ఆటో దొంగిలించినట్లు అప్పట్లో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం కడపకు చెందిన సయ్యద్, అబ్దుల్లాకు ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కలకడ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణయ్య (65) మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మండలంలోని గోపాలపురం వాసి రమణయ్య టమోటా తోట వద్ద పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై బాటవారిపల్లి హంద్రీనీవా కాలువ వద్ద పీలేరు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ ఆయనను 108లో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


సీటీఎం హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. బుధవారం సీటీఎం హైస్కూల్‌లో మదనపల్లె డివిజన్ స్కూల్ గేమ్స్ క్రీడలు ప్రారంభించారు. అండర్-14, 17 బాలబాలికల కబడ్డీ, చెస్ పోటీలు నిర్వహించారు. డివిజన్‌లో సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సీటీఎం హైస్కూల్ హెచ్ఎం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఇక్కడ విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డివిజన్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ భద్రయ్య, శివశంకర్, దిలీప్, నరేష్, మహేంద్రనాయక్, బాలాజీ, విజయ్ కుమార్ సుధాకర్, లక్ష్మీ, భారతి పాల్గొన్నారు.

దశాబ్దాల శ్మశాన వాటిక సమస్య పరిష్కారం


గ్రామస్థులు, నాయకులతో చర్చిస్తున్న తహసీల్దారు శివకుమార్

పీలేరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుల చొరవ, తహసీల్దారు కృషితో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తలపుల పంచాయతీ దళితవాడ శ్మశాన వాటిక సమస్య మంగళవారం పరిష్కారమైంది. గతంలో శ్మశాన వాటిక కోసం తమ గ్రామానికి దూరంగా గుట్టల్లో స్థలాన్ని కేటాయించారని, అక్కడకు చేరుకోవడమే కాకుండా అంత్యక్రియలు నిర్వహించేందుకు కష్టంగా ఉందంటూ దళితవాడ వాసులు దశాబ్దాలుగా అధికారులను కోరుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పీలేరు రెవెన్యూ అధికారులు శ్మశాన వాటిక ఏర్పాటు కోసం తలపుల పరిసరాల్లో అనువైన స్థలం కోసం పరిశీలన జరిపారు. దళితవాడ సమీపంలోనే, తలపుల-యల్లమంద ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నెంబర్-882లో 30 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. తహసీల్దారు శివకుమార్, డీవీఎంసీ సభ్యుడు బోదేషావలి, ఆర్ఐ మురగయ్య, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ నేత అబ్బవరం అమరనాథరెడ్డి గ్రామస్థులతో మంగళవారం చర్చించి వారిని ఒప్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శివకుమార్ మాట్లాడుతూ త్వరలోనే శ్మశాన వాటిక కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి అనుమతులు తీసుకుంటామని, అనుమతులు వస్తానే ప్రహరీ, దారి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. తమ గ్రామ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నందుకు గ్రామస్థులు అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విదేశీ కరెన్సీ పేరుతో బురిడీ

- న్యూస్ పేపర్ల కాగితాల కట్ట చేతిలో పెట్టి రూ.4.50 లక్షలతో ఉడాయించారు
- 2 గంటల్లో ముఠాను పట్టుకున్న పోలీసులు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో విదేశీ కరెన్సీ పేరుతో ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి న్యూస్ పేపర్ల కట్టను గుడ్డలో కట్టి అతడి చేతిలో పెట్టి రూ.4.50 లక్షలతో ఓ చీటింగ్ ముఠా ఉడాయించింది. ఫిర్యాదు అందిన 2 గంటల్లో ఢిల్లీకి చెందిన ముఠాను రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ వివరాలు తెలిపారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన షేక్ హరూన్, ఇరాజ్, నూర్ మహమ్మద్‌ఖాన్‌లు ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పలు రకాల చీటింగ్‌లకు పాల్పడుతూ అమాయకులను మోసం చేసే వారని తెలిపారు. ముఠా సభ్యులు ముగ్గురు కలిసి మంగళవారం రాయచోటి పట్టణంలోని షాపుల వద్దకు వెళ్లి ఏదో ఒక వస్తువు కొనుగోలు చేయడంతో పాటు హిందీలో వారితో మాట్లాడుతూ పరిచయం పెంచుకుని మా వద్ద దుబాయ్ కరెన్సీ నోటు 100 రూపాయలవి ఉన్నాయని, ఒక్క నోటు విలువ ఇండియాలో 2400 ఉంటుందని, మా దగ్గర ఎక్కువ మొత్తంలో నోట్లు ఉన్నాయని, ఇండియా డబ్బు వెయ్యి రూపాయలు ఇస్తే దుబాయ్ కరెన్సీ వంద నోటు ఇస్తామని షాప్ యజమానులను నమ్మిస్తారన్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు దారుడు ఈ చీటింగ్ ముఠా మాయమాటలు నమ్మి అరగంట వ్యవధిలోనే రూ.4.50 లక్షలు డబ్బులు సమకూర్చుకొని నిందితులు చెప్పినట్లు కడప రింగు రోడ్డు వద్దకు వెళ్లగా అక్కడ షాపు వద్దకు వచ్చిన వ్యక్తితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి ఫిర్యాదు దారుడి వద్ద నుంచి డబ్బులు తీసుకుని అప్పటికే వారి వద్ద సిద్ధంగా ఉంచుకున్న న్యూస్ పేపర్ల కట్టను లుంగీలో కట్టి అతడి చేతిలో పెట్టి అక్కడ నుంచి జారుకున్నట్లు తెలియజేశారు. పేపర్ల కట్టకు రెండు వైపులా రెండు విదేశీ కరెన్సీ నోట్లు పెట్టి మోసం చేశారన్నారు. కొద్దిసేపటి అనంతరం ఫిర్యాదుదారుడు వారు ఇచ్చిన కట్టను విప్పి చూస్తే అందులో గుండ్రంగా చుట్టిన న్యూస్ పేపర్ల కట్టతో పాటు రెండు ఒరిజినల్ దుబాయ్ కరెన్సీ నోట్లు తప్ప ఏమీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే రాయచోటి అర్బన్ సీఐ వెంకటచలపతి, ఎస్ఐ బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ అమర్‌నాథ్, కానిస్టేబుల్స్ బాబ్జి, రామకృష్ణ, స్పెషల్ పార్టీ సిబ్బంది శ్రీను, మల్లికార్జునలు గాలింపు ముమ్మరం చేశారని తెలిపారు. నిందితులు సుండుపల్లె రింగు రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.50 లక్షల నగదును రికవరీ చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు డీఎస్పీ వివరించారు. ఫిర్యాదు అందిన తక్షణం స్పందించి రెండు గంటల్లో నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన సిబ్బందిని డీఎస్పీ అభినందించడంతో పాటు రివార్డుల కోసం ఎస్పీకి విన్నవించినట్లు తెలిపారు.

జవహర్ నవోదయకు దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె (ఆకేపాడు) జవహర్ నవోదయలో 2026-27 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతిలో చేరే విద్యార్థులు ఈనెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 2026 ఫిబ్రవరి 7వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు నవోదయ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

మద్దినాయనిపల్లెలో బెల్ట్‌షాపుపై దాడులు

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దినాయనిపల్లెలో మంగళవారం బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తలారీ సుధాకర్(55)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 30 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్‌షాపులు పెట్టి మద్యం అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పాఠశాలలకు.. స్వచ్ఛాంధ్ర రాష్ట్ర పురస్కారాలు


కడప జిల్లా గుండ్లకుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు స్వచ్ఛ అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి పురస్కారాలు ఉమ్మడి కడప జిల్లాలోని మూడు పాఠశాలలకు దక్కాయి. సంబంధిత అధికారులు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందుకున్నారు.



పుల్లంపేటలోని బాలుర ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ కాంప్లెక్స్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న అధికారులు

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

● తపాల ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ రాజేశ్



కడప మారుతీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ పోస్టల్ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 6 నుంచి 10 వరకు కడప డివిజన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప తపాల ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ రాజేశ్ కోరారు. మంగళవారం తపాల ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈక్యాంపులను వివిధ పోస్టాఫీసులు, ఎంపిక చేసిన ప్రభుత్వ ప్రదేశాల్లో (పాఠశాలలు, నివాస కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు) ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ నివాసాలకు దగ్గరగా ఉన్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో కడప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, 10, 11న కడప బాలికల ఉర్దూ పాఠశాలలో, 13, 14న కడప అల్మాస్‌పేట, సాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు సేవలు ఉంటాయన్నారు. ఇందులో 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాలు వయసు గల పిల్లలకు ఉచితంగా బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలందిస్తారన్నారు. ప్రజలందరూ తప్పక సరిచేసుకోవాలని కోరారు.

ప్రమాద రహిత డ్రైవర్లుగా పేరు తెచ్చుకోండి

● డ్రైవర్ల శిక్షణ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించుకున్న ఏపీఎస్ ఆర్టీసీని మరింత ప్రజలకు చేరువ చేసే విషయంలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీలో విధులు నిర్వహించే ప్రతి డ్రైవరు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధతో బస్సులు నడిపి ప్రమాద రహిత డ్రైవర్లుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. మంగళవారం ఆర్ఎం కార్యాలయంలో గల సభాభవనంలో డ్రైవర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులే దేవుళ్లుగా భావించి ఆర్టీసీని అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. తదనంతరం ప్రమాదాల నివారణకు సంబంధించి వివిధ పంచసూత్రాలను డ్రైవర్లకు బోధించారు. కార్యక్రమంలో 20మంది ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ వలంటీర్ల ఎంపికకు దరఖాస్తు చేసుకోండి

కడప స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాటు సమాజసేవ చేసే నిమిత్తం అక్టోబరు 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఆసక్తి గల యువతీ యువకులు నేషనల్ యూత్ వలంటీరుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేరా యువ భారత్ జిల్లా యువ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఇందులో పనిచేసేందుకు ప్రస్తుతం చదువుతున్న వారు, ఉద్యోగం చేస్తున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులన్నారు. ఇది స్వచ్ఛంద సేవ మాత్రమే, ఉద్యోగం కాదని ఎంపికైన వలంటీర్లకు నెలకు రూ.5వేలు స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. ఎంపికైన వారు యువజన సంఘాల స్థాపన, క్రీడలు, ఆరోగ్యం అక్షరాస్యత, పారిశుధ్యం, లింగ వివక్ష తదితర సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరిచి ప్రచారం చేసే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. కనీసం టెన్త్ విద్యార్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పద్ధతిలో నేషనల్ కార్ప్స్ వెబ్‌సైట్‌లో ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు నెహ్రూ యువకేంద్ర కార్యాలయం కడపలో సంప్రదించాలన్నారు.

పని గంటల పెంపు బిల్లు ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల సభ్యులు

రాయచోటి-కలెక్టరేట్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పనిగంటలు పెంచుతూ చేసిన బిల్లును ఉపసంహరించుకోవాలని, మహిళలతో రాత్రిళ్లు పనిచేయించడం మానుకోవాలని, ఏ రంగంలో పని చేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు రామాంజులు, మణి డిమాండ్ చేశారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట దర్నా చేపట్టిన వారు మాట్లాడుతూ పరిశ్రమల్లో మూడు షిప్టులు, రెండు షిఫ్టులుగా మారడంతో ప్రతి ముగ్గురిలో ఒకరి ఉపాధి పోతుందని, నిరుద్యోగులకు ఉపాధి అనేది కలగా మారుతుందన్నారు. పగలే మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వం రాత్రిళ్లు మహిళలతో పనిచేయించడం మానుకోవాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త సర్వేలో అధిక పనిగంటల వల్ల 30 శాతం కార్మికుల్లో హృద్రోగ మరణాలు పెరుగుతున్నాయని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు వెంకట్రామయ్య, సురేంద్రబాబు, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బీవీ రమణ, పీవీ రమణ, చెన్నయ్య, రాంబాబు, హరి, సిద్దమ్మ, మున్సిపల్ గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్వాడీ స్కీం వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ కాలుష్యం నుంచి కాపాడండి

● ఏపీ జెన్‌కో డైరెక్టర్‌కు కలమల్లవాసుల వినతి



జెన్‌కో డైరెక్టర్‌ను కలిసిన కలమల్ల వాసులు

ఎర్రగుంట్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ కాలుష్యం నుంచి తమను రక్షించాలని కలమల్లవాసులు ఏపీ జెన్‌కో థర్మల్ డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఆర్టీపీపీకి వచ్చిన సందర్భంగా వారు ఆయనను కలిసి ఇక్కడ నెలకొన్న సమస్యలను విన్నవించారు. ఆర్టీపీపీ నుంచి వచ్చే బూడిదతో ఇళ్లలో సర్వం కలుషితమవుతున్నాయని, వీటివల్ల అనేక రకాల జబ్బులు వస్తున్నాయన్నారు. శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, కళ్ల దురదలు రోజురోజుకు అధికమవుతున్నాయన్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక ఎక్కడ పడితే అక్కడ బూడిదను డంపింగ్ చేయడం, లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తుండడంతో కాలుష్యం పెరుగుతోందన్నారు. ఆర్టీపీపీలోని 600 మెగావాట్ల నుంచి కెమికల్ కాలుష్యాన్ని వంకలోకి వదలడంతో అది ఇళ్లలోకి వస్తోందన్నారు. ఆర్టీపీపీ చుట్టుపక్కల పల్లెల్లోకి కాలుష్యం చేరుతోందన్నారు. ఆర్టీపీపీ చుట్టూ ఉన్న కాలుష్యం, వాటివల్ల కలిగే నష్టాలు, కష్టాలపై ఫొటోలతో సహా డైరెక్టర్‌కు వివరించారు. ఇక రాత్రిపూట కారుచీకటి ఉన్నందున పెట్రోల్ బంకు నుంచి చిలమకూరు క్రాస్ రోడ్డు వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు తరచు వైద్యపరీక్షలు నిర్వహించి వ్యాధుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని కలమల్లవాసులు పేర్కొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఏపి జెన్‌కో థర్మల్ డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని 1535 యూనియన్ నాయకులు మంగళవారం కలిశారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఈ వాసుదేవరావు, ఎస్ఈలు సోమశేఖర్‌రెడ్డి, క్రిష్ణమోహన్‌రెడ్డి, యూనియన్ నాయకులు రామక్రిష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, రమణయ్య, జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చెన్నకేశవులు, మధుసూదన్‌రావు, సురేంద్రబాబు డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

చెన్నూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఉద్యోగులు మాత్రమే కాదని సమాజ నిర్మాతలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న మెగా డీఎస్సీ -2025 నూతన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యకు ప్రాధాన్యం ఇచ్చి తొలి సంతకం మెగా డీఎస్సీపై చేయడం విద్యాభివృద్ధిపై ఆయన నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషితో కేవలం 150 రోజుల్లోనే నియామక ప్రక్రియ పూర్తి కావడం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా అభివర్ణించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకత, నైతిక విలువలు పెంచిమంచి పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. డిజిటల్ క్లాస్‌రూమ్స్‌స్మార్ట్ బోధన పద్ధతులతో విద్యారంగంలో సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ షంషుద్దీన్, ఏపీసీ నిత్యానందరాజులు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, ఎంఈఓలు వెంకటేష్, సుభాషిణి, రఫీక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

దువ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరెడ్డిపల్లెకు చెందిన ఇరగంరెడ్డి రామమోహన్‌రెడ్డి (29) గడ్డి మందు తాగి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ భూషణం తెలిపారు. బీటెక్ చదివిన యువకుడు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడం, అనారోగ్య కారణాలతో ఈ నెల 5వ తేదీ విషద్రావణం తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమ్మితం కర్నూలుకు తరలించారు. అక్క డ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి అంకిరెడ్డి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఘర్షణలో డ్రైవర్‌కు గాయాలు

దువ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ షేక్ మహమ్మద్ ప్యాసింజర్ హేమవర్గం ఘర్షణ పడ్డారు. బస్సు నిండిపోయే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ప్యాసింజర్ డ్రైవర్‌ను గాయపరిచినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బాధితుడు షేక్ మహమ్మద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో సీఐ మృతి

● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ముద్దనూరు అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన సీఐ జాన్సన్‌బాబురావు(49)కు మంగళవారం ముద్దనూరులో పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జాన్సన్‌బాబురావు స్వగ్రామం ముద్దనూరు మండలం నల్లబల్లె గ్రామం. 2002లో ఎస్‌ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తరువాత సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో తాత్కాలికంగా వీఆర్‌లో ఉన్నారు. మృతదేహాన్ని సొంతగ్రామం నల్లబల్లెకు తీసుకువచ్చి, ముద్దనూరులోని సీఎస్‌ఐ చర్చి వద్ద నున్న శ్మశాన వాటిలో పోలీసులు తుపాకీతో గాలిలో పేల్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఇరువర్గాల ఘర్షణ - కేసు నమోదు

మైలవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గూగూసానిపల్లె గ్రామంలో స్థల విషయమై టీడీపీలోని ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు వివేకానందరెడ్డి, మరో నలుగురు మరోవైపు సునీల్‌కుమార్ సహా గురుమోహన్‌రెడ్డి, మరికొందరు క్రాస్‌రోడ్డు వద్ద స్థల విషయమై ఘర్షణపడి రాళ్లతో, కట్టెలతో దాడి చేసుకున్నారు. గాయపడినవారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి - ఏడుగురు అరెస్టు

ప్రొద్దుటూరు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రోడ్డుఎకో పార్కు సమీపంలో పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడిచేశారు. ఈ దాడిలో ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.81వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పీలేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కాలనీలోని ఓ పేకాట స్థావరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని, రూ.16 వేల నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 10 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యుగంధర్ మంగళవారం తెలిపారు.

అంకాల శైలజకు గోల్డ్‌మెడల్



శైలజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ విద్యార్థిని అంకాల శైలజకు (ఎంకాం 2022-24 బ్యాచ్) తెలంగాణ గవర్నర్ నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ బయపురెడ్డి విద్యార్థిని అభినందించారు.

'సీజేఐపై దాడి గర్హనీయం'

వేంపల్లె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి గర్హనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై సనాతన ధర్మం పేరుతో రాకేష్‌కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడి చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రతి ప్రతి భారతీయుడు ఖండించాలని, నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక ప్రకటనలో అన్నారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం

సీకేదిన్నె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంపూర్ణాభివృద్ధికి మానసిక ఆరోగ్యం ముఖ్యమని జిల్లా ఏపీసీ నిత్యానందరాజులు తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు జిల్లా జీసీడీఓ దార్ల రూతు ఆరోగ్యమేరీ మానసిక ఆరోగ్యం, ఆహార అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ శిల్ప, డాక్టర్ నాగభూషణం, ఏఎంఓ వీరేంద్ర, ఏఎస్ఓ సంజీవరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10 తులాల బంగారు నగలు, నగదు అపహరణ



కొప్పర్తిలో ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

సీకేదిన్నె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కొప్పర్తి గ్రామంలో కోగటం సరస్వతమ్మను అగంతకులు మభ్యపెట్టి 10 తులాలు బంగారు నగలు, రూ.50 వేలుపైగా నగదు అపహరించినట్లు చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు.. కోగటం సరస్వతమ్మకు ఇద్దరు మగపిల్లలు, ఆడపిల్ల కాగా మగపిల్లలు హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె, అల్లుడు కడప నగరంలో నివాసం ఉంటున్నారు. ఇంటి మిద్దె పైభాగంలో కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో ఉద్యోగం చేసే ఒకరికి అద్దెకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి, ఇద్దరు బయట ఉండగా ఓ వ్యక్తి పెళ్లిపత్రిక ఇచ్చే క్రమంలో లోనికి వెళ్లి పై నుంచే వ్యక్తి గురించి అడుగగా అతను ఈ సమయంలో ఉండరని తెలిపింది. అయితే వచ్చిన వ్యక్తి కార్డుపై పేరు రాసిస్తాను, పెన్ను ఇవ్వాల్సిందిగా అడగ్గా అప్పటికే అన్నం తింటున్న ఆమె పెన్ను తెచ్చేందుకు లోనికి వెళుతుండగా వచ్చిన వ్యక్తి ఆమెతో పాటే వెళ్లి ఆమె నోరు గట్టిగా మూసి పక్కనే ఉన్న బెడ్‌రూములోకి తీసుకెళ్లాడు. అదే సమయంలో బయట ఉన్న ఇద్దరు కూడా లోనికి ప్రవేశించి ఆమె చేతులు వెనక్కు కట్టివేశారు. అనంతరం ఆమెను బెదిరించి ఆమె వద్ద ఉండే నాలుగు బంగారు గాజులు, సరుడు, రెండు ఉంగరాలు, రెండు జతల కమ్మలు, తాళిబొట్టు లక్ష్మికాసులు, బీరువాలో నుంచి రూ.50 వేలకుపైగా నగదు తీసుకెళ్లినట్లు తెలిపారు. వృద్ధురాలు తనను ఏమీ చేయవద్దని, మీకు కావాల్సినవి తీసుకెళ్లండని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒంటరి మహిళలు, వృద్ధులు లక్ష్యంగా పెట్టుకుని దుండగులు సులభంగా డబ్బు సంపాదించేక్రమంలో ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు.

ఆదాయ పెంపు మార్గాలు అన్వేషించాలి



ఆదాయ వనరుల గూర్చి వివరిస్తున్న రిసోర్స్ పర్సన్ సిగ్బతుల్లా

పీలేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు ఆర్థికంగా బలోపేత మయ్యేందుకు ఉన్న అవకాశాలను అన్వేషించాలని సచివాలయ సిబ్బందికి పీలేరు ఎంపీడీఓ రాజేశ్వరి సూచించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా 'పంచాయతీల సొంత ఆదాయ వనరుల కల్పన, అభివృద్ధిపై సర్పంచులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గ్రామాల పరిధిలో ఉన్న భూములు, జలవనరులు, వాణిజ్య సముదాయాల వినియోగదారుల లైసెన్సులు, పన్నులు, జరిమానాలు, విరాళాలు వంటి వాటిపై దృష్టి సారించి పంచాయతీల ఆదాయం పెంచుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్ సిగ్బతుల్లా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలన్నింటిలోనూ చెరువులు కళకళలాడుతున్నాయని, వాటిల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంటులు, పన్నులపై ఆధారపడకుండా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

పౌర్ణమి వెలుగులో అభయాంజనేయుడికి పూజలు



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు - పౌర్ణమి పూజలందుకుంటున్న కార్యసిద్ధి అభయాంజనేయస్వామి

వాల్మీకిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం మూలవర్లకు అభిషేకం, విశేషాలంకరణ, అనంతరం భక్తజనం నడుమ సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణ, భక్తుల నడుమ వల్లీదేవ సేవ సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. రాత్రికి నిండు పౌర్ణమి వెలుగులో కార్యసిద్ధి అభయాంజనేయుడికి ఆకుపూజ, సింధూర పూజ, వడమాల, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్న వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మారెమ్మ తల్లికి దీపాల సమర్పణ



దీపాలు సమర్పిస్తున్న మహిళలు

ప్రత్యేక అలంకరణలో కొలువు దీరిన మారెమ్మతల్లి

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విసనకర్రవాండ్లపల్లెలో దేవకీ కుటుంబ సభ్యులు కొత్తగా నిర్మించిన మారెమ్మ, యల్లమ్మ, గంగమ్మ గ్రామ దేవతలకు మంగళవారం గ్రామస్తులు దీపాలను సమర్పించారు దేవకీ కుటుంబ సభ్యులు ఆలయాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు అయిన సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇటీవల గ్రామస్తుల సమన్వయంతో దేవకీ వెంకటేష్ కుటుంబ సభ్యులు మహాచండీ హోమం నిర్వహించారు. అనంతరం మంగళవారం గ్రామస్తులందరూ కలసి ఊరి పండుగలో భాగంగా పెద్ద ఎత్తున అమ్మవారికి ఇంటింటికీ దీపాలను సమర్పించారు. అమ్మవారి బలిపోతుకు పూలహారాలు వేసి ఊరేగింపుగా ఊరేగించారు. ఇంటింటా బలిపోతుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బలిపోతును అమ్మవారికి బలిచ్చారు. మహిళలు పెద్దఎత్తున దీపాలను సమర్పించారు. అమ్మవారికి జంతుబలులను సమర్పించి మొక్కులను చెల్లించారు. 41 రోజులు ప్రత్యేక నియమ, నిష్టతో పూజలు నిర్వహించి అమ్మవారికి దీపాలను సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. మొదట మారెమ్మ అమ్మవారికి అనంతరం గంగమ్మకు, యల్లమ్మకు వేరువేరుగా దీపాలను సమర్పించారు. పెద్దఎత్తున గ్రామస్తులు, మహిళలు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం బంధు, మిత్రులతో కళకళలాడింది. బుధవారం గ్రామస్తుల సహకారంతో ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సమీప గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

దేశద్రోహం కేసు నమోదు చేయాలి

సీజేఐ గవాయ్‌పై దాడిని ఖండించిన ప్రజాసంఘాలు



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

పీలేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)పై దాడికి యత్నించిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని పీలేరులోని పలు ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీజేఐపై దాడిని ఖండిస్తూ మంగళవారం వారు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీ కుమార్ మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌ది రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌తో కలిసి నడిచిన కుటుంబమని, అటువంటి వ్యక్తిపై మతోన్మాదంతో దాడికి యత్నించిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి ఉరిశిక్ష వేయాలన్నారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుకున్న అసలు ఉద్దేశాలు బహిర్గతం చేయాలన్నారు. అనంతరం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. నేతలు పఠాన్ మౌల, పాలకుంట శ్రీనివాసులు, సుభాష్, సుధాకర్ బాబు, గండికోట వెంకటేశ్, జెట్టి మల్లిఖార్జున, టీఎల్ వెంకటేశ్, దుబ్బా శ్రీకాంత్, కిల్లా విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి శోచనీయం

మదనపల్లె టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడం శోచనీయమని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ పేర్కొన్నారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపిన బీవైఎస్ నేతలు నోటికి నల్లగుడ్డలు కట్టుకుని మౌనంగా నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జస్టిస్ స్థానంలో వున్న గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్య అన్నారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగాన్ని అగౌరవపరచడమే అన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు జిలానిబాషా, హరికృష్ణ, వినయ్, లోకేశ్, శశికుమార్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్/అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదికవి, రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం పట్టణంలో పలు చోట్ల వేడుకగా నిర్వహించారు. తమ సామాజికవర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని పలువురు వాల్మీకి సంఘ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్తూరు బస్టాండు వద్ద వాల్మీకి ధర్మసమాజ్ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి నివాళులర్పించి, పేదలకు అన్నదానం చేశారు. వాల్మీకి ధర్మసమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులకుంట్ల హరినాథ్ మాట్లాడుతూ 60 ఏళ్లగా వాల్మీకి రిజర్వేషన్ కోసం పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై ఎమ్మెల్యే షాజహాన్ బాష మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో చేర్చడాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. మదనపల్లె ఆర్టీసీ 1, 2 డిపోలో ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వాల్మీకుల సంక్షేమానికి కృషి చేస్తోందని, వారి చిరకాల ఆకాంక్ష అయిన రిజర్వేషన్‌పై ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. వాల్మీకి సంఘాల నేతలు పాల్గొన్నారు. వేడుకల్లో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు, రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల విజయ్ మోహన్, స్టేట్ యూత్ ప్రెసిడెంట్ టేకుపల్లె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల పోరాటాన్ని గుర్తించండి

పీలేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చమని 60 ఏళ్లగా పోరాటాన్ని గుర్తించాలని సంఘ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పీలేరు ఏఎంసీ ప్రాంగణలో నిర్వహించిన వాల్మీకి జయంతిలో సంఘ నేతలు గుండ్లూరు మురళి, రెడ్డప్ప, వెంకటరమణ, చెంగ్రాయులు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చమని 60 ఏళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా తమకు హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేశ్ తమ డిమాండ్ నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా బిల్లు ప్రవేశ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అంతకుమునుపు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. వారాది వెంకటరమణ, మురళి, శీనా, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

60 ఏళ్ల పోరాటాన్ని గుర్తించాలని వాల్మీకి సంఘ నేతల డిమాండ్ ● భారీగా ర్యాలీలు, నివాళులర్పించిన కుల పెద్దలు

● సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే



ములకలచెరువులో ప్రత్యేక అలంకరణలో వాల్మీకి విగ్రహం - మదనపల్లె జయంత్యుత్సవాల్లో శ్రీరాం చినబాబు - పీలేరులో వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న సంఘ నేతలు, సభ్యులు

నేటికీ ఆదర్శంగా రామాయణం

కలికిరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి రచించిన రామాయణమే ఇప్పటికీ భారత దేశానికి ఆదర్శప్రాయంగా వుందని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కార్యదర్శి బాలె శ్రీనివాసులు అన్నారు. మహర్షి జయంతి వేడుకలో క్రాస్ రోడ్డు వద్ద గాంధీ విగ్రహం ముందు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనను కొనియాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పాళెం గ్రామ వాల్మీకి కుటుంబాలు పాల్గొన్నాయి. కొండప్ప, రమణ, వెంకటేష్, నరసింహులు, కాంతం, ప్రకాష్, రవి తదితరులు హాజరయ్యారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ములకలచెరువు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తలారివారిపల్లెలో వాల్మీకి జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. వాల్మీకి విగ్రహానికి పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కళాకారు చెక్కభజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి.

బి.కొత్తకోటలో వేడుకగా...

బి.కొత్తకోట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బండెన్న స్వామి ఆలయం వద్ద మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరాయ్యరు. పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి ఇక్కరూ వాల్మీకి మహర్షిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లి, తంబళ్లపల్లి నియోజక వర్గాలకు చెందిన హిందూ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

మండల సమావేశంలో ఎంపీపీ పూర్ణచంద్రిక



పెద్దమండ్యం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక పిలుపు నిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమస్యలను కార్యదర్శులు, సర్పంచ్‌లు అధికారులకు తెలియజేయాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ రామూర్తి నాయక్ మాట్లాడుతూ ఈ ఏడాది డిశంబరు లోగా ప్రతి పల్లెకు నిరంతర విద్యుత్తు సరఫరాకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. డీడీలు చెల్లించిన రైతులకు సీరియల్ ప్రకారం విద్యుత్తు పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ మాట్లాడుతూ గ్రామాల్లోని నీటి కుళాయిల వద్ద పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. వాటర్‌షెడ్ పీఓ రవీంద్రుడు మాట్లాడుతూ మండలంలో వాటర్‌షెడ్ అభివృద్ధి పనులకు మంజూరైన రూ. 7 కోట్లు నిధులు సకాలంలో సద్వినియోగం చేయాలని వాటర్‌షెడ్ కమిటీలను కోరారు. అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ పెద్దమండ్యం పాతూరు సమీపంలోని జండామాను, ప్రధాన వీధుల్లో వీధి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముసలికుంటలో కొత్త సచివాలయ భవనం పెండింగ్ బిల్లులు చెల్లించి భవనం వినియోగంలోకి తీసుకురావాలని కమిటీ సభ్యులు జిట్టా రమేష్, నటరాజ నాయక్, శ్రీనివాసులు, శంకర, రఘునాధ కోరారు. కుషావతినదిపై బ్రిడ్జి నిర్మించాలని, మదనపల్లి-వేంపల్లి వయా గండి క్షేత్రం ఆర్టీసీ బస్సు నడపాలని, గతంలో జరిగిన అభివృద్ధి పనుల పెడింగ్ బిల్లులు చెల్లించాలని, పెద్దమండ్యం హైస్కూల్‌లో కూలిపోయిన ప్రహరీని నిర్మించాలని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు పీరమ్మ, వైఎస్ ఎంపీపీలు జయచంద్రారెడ్డి, శారద, మండల కోఆప్షన్ ఖాదర్‌వలీ, పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ షాబాజ్ బాష, ఎంఈఓ రామకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, పశువైద్యాధికారి ఉస్మాన్, హౌసింగ్ ఏఈ అక్రం, ఏపీఓ సురేంద్రరెడ్డి, ఈఓఆర్డీ జనార్ధన, ఏఓ సురేష్‌బాబు, ఏపీఎం నరసింహులు, ఆర్టీసీ ఏడీ కృష్ణమూర్తి, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌రెడ్డి, హర్షవర్ధనరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ములకలచెరువు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్య ప్రశాంతగా మండల్ మీట్ ముగిసింది.

సూపర్ జీఎస్టీపై వ్యాసరచన పోటీలు

నిమ్మనపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు జడ్పీహైస్కూల్ హెచ్ఎం అంజాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారం పడకుండా వుండేందుకు జీఎస్టీని తగ్గించినట్లు తెలిపారు. జీఎస్టీ తగ్గుదల తరువాత చాలా రకాల వస్తువుల ధరల్లో మార్పులు వచ్చాయన్నారు. వీటిలో ఎక్కువగా నిత్యావసరాలు చౌకగా వస్తున్నట్లు తెలిపారు. జీఎస్టీ ద్వారా తగ్గిన వస్తువుల గురించి విద్యార్థులచే డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి వారికి అవగాహన కల్పించామని తెలిపారు. వ్యాపారులు తగ్గిన వస్తువుల ధరను షాపుల ముందు ధరల పట్టికను డిస్‌ప్లే చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుస్థిర లక్ష్యాలు అమలు చేయాలి

నిమ్మనపల్లి అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవాలంటే సుస్థిర లక్ష్యాలను అమలు చేయాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎంల సహకారం అవసరమన్నారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అమలుకు సహకరించేలా పురోగతి ప్రణాళిక 2.0ను రూపొందించి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

చదును చేసిన వారిపై కేసు



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, సీఐ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కోళ్లబైలులో సర్వే నెంబరు 529లోని ప్రభుత్వ భూమిని చదును చేసి భూమి స్వరూప, స్వభావాలను మార్చడంపై తహసీల్దారు కిషోర్‌కుమార్ రెడ్డి ఫిర్యాదుపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిలోకి రామిశెట్టి రవి, పద్మనాభం, నాగార్జున ప్రవేశించి చదును చేశారు. భూ మిని తహసీల్దారు, తాలూకా సీఐ కళా వెంకట్రమణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

వైభవంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

వాల్మీకుల భారీ ర్యాలీ సంబరాలు





ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ నేతలు - ప్రతిష్టించిన వాల్మీకి మహర్షి విగ్రహం

వాల్మీకిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాల్మీకి జయంతిని వైభవంగా చేసుకున్నారు. మహర్షి వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు మిన్నంటాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాల్మీకి మహర్షి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పపల్లకిలో మహర్షి చిత్రపటాన్ని నగరోత్సవం నిర్వహించారు. వందలాదిమంది వాల్మీకులు, మహిళలు హాజరై భారీ బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక పట్టాభిరామాలయం చేరుకుని ఆలయంలోని వాల్మీకి మహర్షికి పూజలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో వాల్మీకి మహర్షి సేవా కమిటీ నేతలు, సభ్యులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రాభివృద్ధి



పీకేఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబుకు జ్ఞాపిక అందిస్తున్న నేతలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వాల డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రం అభివృద్ధివైపు పరుగులు తీస్తోందని పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం విజయభారతి హైస్కూల్లో బీజేపీ నేతలు నరసింహారెడ్డి, ఎన్.సేతు ఆధ్వర్యంలో సురేష్ బాబును సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పీకేఎం ఉడా నిధులన్నీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరుకే ఉపయోగించారని తప్పుపట్టారు. బీజేపీ నేతలు అజ్మతుల్లాఖాన్, టీడీపీ నాయకులు పెరవలి నవీన్, నిరంజన్‌నాని, రాజేష్, మురళి, న్యాయవాది గణపతి, సాయిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై వివరిస్తున్న సూపర్‌వైజర్

తంబళ్లపల్లె, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పోషకాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార మసోత్సవాల్లో కొటాల అంగన్‌వాడీ కేంద్రంలో సుపోషిత్ భారత్, సక్షం భారత్ నిర్వహించారు. చిన్నారులకు ఇచ్చే బాలామృతం, ఆకుకూరలు, తృణ ధాన్యాల్లో ఉండే పోషక విలువలు తినడం వలన కలిగే ఉపయోగాల గురించి బాలింతలు, చిన్నారుల తల్లులకు వివరించారు. అంగన్‌వాడీలు చంద్రకళ, నాగరత్న, ప్రమీల, సుగుణ, లలిత, పాల్గొన్నారు.

కలికిరి స్కూల్ ఖాతాలో మరో విజయం



కలికిరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలికోన్నత పాఠశాల మదనపల్లెలో మంగళవారం జరిగిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో మరో విజయాన్ని తన ఖాతాలో జమచేసుకుంది. సోమవారం బాల్‌బాడ్మింటన్ పోటీల్లో 16 జట్లతో పోటీపడిన ఇద్దరు బాలికలు విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించగా మంగళవారం జరిగిన అండర్ 14 విభాగం చెస్ పోటీల్లో లాస్యప్రసాద్ జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ప్రభుత్వం పాఠశాలల పీడీలు టి.చిన్నప్ప (క్రీడా కార్యదర్శి), శారద, ఖాదర్‌బాష పోటీలను పర్యవేక్షించారు. విజేత లాస్యను క్రీడా మైదానంలో పలువురు ప్రశంసించారు.

'స్వచ్ఛ'లో తెట్టుకు అరుదైన గుర్తింపు



కలెక్టర్ నిశాంత్‌కుమార్ నుంచి అవార్డును అందుకుంటున్న సర్పంచ్ మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామప్ప

కురబలకోట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 2024-2025కు సంబంధించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడం, స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ సంకల్పించింది. దీంతో గ్రామంలో పారిశుధ్యం మెరుగు, అభివృద్ధి కోసం వివిధ రకాల సేవలను అందించడానికి చర్యలు చేపట్టింది. గ్రామాల అభివృద్ధి, పారిశుధ్యం తదితర అంశాల ద్వారా ఎంపిక చేసింది. కాగా స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ద్వారా వీటిని అమలు చేయడానికి చర్యలు చేపట్టింది. ప్రధానంగా గ్రామాల్లో స్వచ్ఛత, పారిశుధ్యం ప్రాధాన్యమిచ్చింది. రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రలో పారిశుధ్యం మెరుగు చేపట్టారు. ప్రభుత్వం నిర్ధేశించిన ఆరు అంశాలను పరిధిలోకి తీసుకుని సేవలను అందిస్తారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించడం, తడి, పొడి చెత్తను వేరు చేయడం, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి 3వ శనివారం ప్రతి గ్రామంలో చెత్తను సంపదగా సృష్టించడం, మౌలిక వసతులు కల్పించడం ప్రధానోద్ధేశ్యం. గ్రామస్తులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. ఈ ఆరు అంశాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన తెట్టును స్వచ్ఛ గ్రామ పంచాయతీ అవార్డును ఎంపిక చేసింది. దీంతో తెట్టుకు స్వచ్ఛ గ్రామపంచాయతీ అవార్డును సర్పంచ్ మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామప్పకు కలెక్టర్ నిశాంత్‌కుమార్ మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

సమన్వయంతో అవార్డును సాధించాం : సర్పంచ్

పంచాయతీ పరిధిలో అన్ని శాఖల సమన్వంతో పని చేసి జిల్లాలో టాప్‌గా నిలిచి అవార్డును సాధించామని సర్పంచ్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశించిన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్రలో భాగంగా గ్రామంలో పారిశుధ్యం అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలను, లక్ష్యాలను పూర్తి చేశాం. చేసిన సేవలను 100శాతం పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించాము. దీంతో తెట్టుకు అరుదైన అవకాశం దక్కడం ఎంతో ఆనందంగా ఉంది. సిబ్బంది పని తీరుతోనే తాము ఈ అవార్డును సాధించాము. అవార్డుతో మరింత మెరుగైన సేవలను అందిస్తాము.

పేదల ఆరోగ్యరక్షణకు సీఎం ఆర్‌ఎఫ్

మదనపల్లె టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయనిధి ఎందరినో ఆదుకుంటోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. కొత్తవారిపల్లె, సీటీఎం గ్రామాల్లో నలుగురికి రూ.2లక్షల మేరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ చల్లా నరసింహులు, రెడ్డిరామ్‌ప్రసాద్, జిలానిబాషా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.